




PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 118, పేజీలు - 08








శనివారం, అక్టోబర్ 4, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## స్థానిక ఎన్నికల్లో జెండా పాతాలని
# బీజేపీ వ్యూహాలు

**- తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు వ్యూహాలేంటి.?**
**- వరుస వర్క్ షాపుల సీక్రెట్ ఇదేనా.!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుండి ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. స్థానిక ఎన్నికలంటే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందనే టాక్ ఉన్నప్పటికీ, మేమెక్కడా తగ్గేదే లేదంటున్నాయి బిజేపి ,బీఆర్ ఎస్ పార్టీలు. ముఖ్యంగా బిజేపి ఈసారి లోకల్ వార్ లో సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. అర్బన్ ప్రాంతాల్లోనే పట్టుందనేది కేవలం రూమర్లు మాత్రమే, బిజేపి బలం గ్రామీణ ఓటర్లేనని నిరూపించేందుకు ఇప్పటికే క్యాడర్ ను సన్నద్ధం చేస్తోంది.

### గ్రామాల్లో పట్టుందన్న బీజేపీ

తెలంగాణ బిజేపికి 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్నారు.ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురు గ్రేటర్ బయట గెలిచినవారే. ఎనిమిది ఎంపీల విషయానికి వస్తే , వీరు గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గాలు ఎక్కువ గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాలే. ఇది చాలదా మా గెలుపు ఏ స్థాయిలో ఉంటుందో చూపించడానికి అంటోంది కమలం పార్టీ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం. గ్రామస్థాయి సర్పంచ్ నుండి జిల్లా స్థాయి జెడ్ పీటీసీ వరకూ బిజెపి అభ్యర్థులను పోటీకి దించడంతోపాటు, కాంగ్రెస్ ,బిఆర్ ఎస్ ను అధిగమించి , నెంబర్ వన్ స్థానాలు మేమే సాధిస్తామంటున్నారు ఆ పార్టీ కీలకనేతలు. బిజేపికి గ్రామీణ ప్రాంతాల్లో బలమైన క్యాడర్ ఇప్పటి వరకూ లేదు. క్షేత్రస్థాయిలో బలమైన నాయకులు లేరు. ప్రకటించిన స్థాయిలో అభ్యర్థులను ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దింపాలన్నా, అంతలా సై అంటూ దూకే అభ్యర్థులు ఇప్పటి వరకూ లేరు. బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పగ్గాలు చేపట్టిన తరువాత , పార్టీలోకి వలసలు ఆహ్వానించినా, బిజేపి తలుపులు ఓపెన్ చేసి పెట్టినా, ఆశించిన స్థాయిలో పార్టీలోకి చేరికలు కనిపించలేదు. మరీ ముఖ్యంగా జిల్లా, గ్రామీణ స్థాయిలో బలమైన క్యాడర్ చేరిన దాఖలాలు లేవు.

### క్రమంగా పుంజుకుంటున్న బీజేపీ

కానీ బిజేపి లెక్కలు మాత్రం మరోలా ఉన్నాయి. తెలంగాణలో గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో బిజేపికి 8మంది ఎమ్మెల్యేలు, 8మంది ఎంపీలు లేరు. అందులోనూ పార్టీకి

2లో..

## పాకిస్తాన్‌ను మ్యాప్‌లో లేకుండా చేస్తాం

**- ఆర్మీఛీఫ్ స్ట్రాంగ్ వార్నింగ్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్-పాక్ సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. తాజాగా సర్ క్రీక్ సరిహద్దు ప్రాంతంలో పాకిస్తాన్ సైనిక కార్యకలాపాలను పెంచడం, నిర్మాణాలు చేపడుతుండటంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీనిపై ఇప్పటికే రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ పాకిస్తాన్ కు తీవ్ర హెచ్చరికలు చేశారు. అయినా పాకిస్తాన్ వైపు నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో ఆర్మీ ఛీఫ్ ఉపేంద్ర ద్వివేదీ మరింత తీవ్ర హెచ్చరిక చేశారు. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపకపోతే మ్యాప్ లో నుంచి పాకిస్తాన్ ను తుడిచిపెడతామంటూ ఆర్మీఛీఫ్ ఉపేంద్ర ద్వివేదీ పొరుగుదేశాన్ని హెచ్చరించారు. పాకిస్తాన్ తన స్థానాన్ని నిలుపుకోవాలనుకుంటే ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాలని సూచించారు. రాజస్థాన్‌లోని అనుప్‌గఢ్‌లోని ఒక ఆర్మీ పోస్ట్‌లో జనరల్ ద్వివేది ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత దళాలు ఎటువంటి సంయమనం పాటించవని, ఇస్లామాబాద్ ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడాన్ని ఆపకపోతే ఆపరేషన్ సింధూర్ రెండో వెర్షన్ ఎంతో దూరంలో లేదని స్పష్టం చేశారు. ఈసారి ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపిన సంయమనాన్ని ఇకపై కొనసాగించబోమని పాకిస్తాన్ ను ఆర్మీ ఛీఫ్ హెచ్చరించారు. ఈసారి పాకిస్తాన్ భౌగోళికంగా తన స్థానాన్ని నిలుపుకోవాలనుకుంటుందా

2లో..

## వైభవంగా 'అలయ్ బలయ్' వేడుక

**- హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ గవర్నర్ దత్తాత్రేయ ఆధ్వర్యంలో "అలయ్ బలయ్" సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా 20వ ఏడాది ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ వేడుకలను 2005లో ప్రారంభించారు. నాటి నుంచి విజయదశమి మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం కళాకారులతో కలిసి వీహెచ్ డప్పు వాయించి సందడి చేశారు. ఈసారి 'ఆపరేషన్ సింధూర్' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను ప్రదర్శించే ఈ వేడుక ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు నాగార్జున, బ్రహ్మానందం లను సత్కరించనున్నారు. ఈ మేరకు సినీ, రాజకీయ ప్రముఖులు మాత్రమే కాకుండా కవులు, సామాజిక నేతలు సైతం పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి ఉన్నారు. అలానే సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కూడా హాజరయ్యారు. బండారు దత్తాత్రేయ వీరందరికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఇక అలయ్ బలయ్‌కు వచ్చే అతిథుల కోసం 87 రకాల ప్రత్యేక తెలంగాణ వంటకాలు సిద్ధం చేశారు.

2లో..

### తెలుగు రాష్ట్రాల సీఎంలకు బండారు దత్తాత్రేయ పిలుపు

**- ఇరువురు సమన్వయంతో ముందుకు సాగాలని సూచన**



2లో..

## అమరావతి పునర్నిర్మాణానికి ఎస్‌పీవీ

**- ఏపీ కేబినెట్‌లో కీలక నిర్ణయాలు**

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందించే పథకానికి ఆమోదం
- అమరావతి అభివృద్ధి పనుల వేగవంతానికి ఎస్‌పీవీ ఏర్పాటు
- రాజధానిలో మిగిలిన భూముల సేకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- టెక్ హబ్‌ల ఏర్పాటుకు 'లిఫ్ట్' పాలసీకి అనుబంధ ప్రతిపాదనల ఆమోదం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయం వేదికగా సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్

2లో..

## నిర్ణయం ఎప్పుడంటే.?

**- కవిత ఆలోచన అదేనట- క్యాడర్ ఇక ఫుల్ హ్యాపీస్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ మాజీ నేత కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే బీఆర్ఎస్ తో పూర్తిగా తెగదెంపులు చేసుకున్నట్లుగా కవిత ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మండలి చైర్మన్ ను మరోసారి కలిసి ఎలాగైనా ఎమ్మెల్సీ పదవి రాజీనామా ను

2లో..



## హైవేలపై క్యూఆర్
# కోడ్ బోర్డులు

**- ఎన్‌హెచ్‌ఏఐ కీలక నిర్ణయం**

- స్కాన్ చేస్తే ప్రాజెక్ట్ వివరాలు, అత్యవసర నంబర్లు అందుబాటులోకి
- సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల సమాచారం కూడా
- ప్రయాణికుల సౌకర్యం, భద్రతను పెంచడమే లక్ష్యం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై హైవేల వెంట క్యూఆర్ కోడ్లతో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా ప్రయాణికులు రహదారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, అత్యవసర సేవలను సులభంగా పొందవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా జాతీయ

2లో..

## దామోదర్ రెడ్డి భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళి

**- రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకుల నివాళులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం దామోదర్ రెడ్డి మృతి చెందారు. ఈరోజు ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళు లర్పించారు. దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి

2లో..

## వరద ప్రభావిత ప్రాంతాల్లో
# సమన్వయంతో పనిచేయండి

**- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కీలక ఆదేశాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఉత్తరాంధ్ర జిల్లాలను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, సురక్షిత మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా (ఆర్.డబ్ల్యూ.ఎస్.) శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలో తుపాను ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. ఒడిశా నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో వంశధార, నాగావళి నదులు ఉప్పొంగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా శ్రీకాకుళంలోని గొట్టా బ్యారేజీతో పాటు, వంశధార ప్రాజెక్టులోకి అంచనాలకు మించి వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న పవన్, సహాయక చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. "వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలు

2లో..

### విజయ్ ప్రచార సభ తొక్కిసలాట ఘటన

**- సిట్ విచారణకు హైకోర్టు ఆదేశం**

2లో..





## రేవంత్ రెడ్డిని వదిలి పెట్టను

**- ఓడించి తీరుతానని ప్రశాంత్ కిషోర్ శపథం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జన్ సురాజ్ పార్టీ అధినేత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిపై మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "వచ్చే ఎన్నికల్లో తెలంగాణకు వెళ్లి రేవంత్‌ను ఓడించి తీరుతాను.. రాహుల్ గాంధీ, మోదీ ఎవరూ కాపాడలేరు" అని తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. బిహార్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో తన జన్ సురాజ్ పార్టీని బలోపేతం చేసుకోవడానికి రేవంత్ రెడ్డిని ప్రశాంత్ కిషోర్ ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023 డిసెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ తన కేబినెట్‌లో బిహార్‌కు చెందిన అధికారులను ఎక్కువగా నియమించారని, వారిని

2లో..



## స్థానిక ఎన్నికల్లో జెండా పాతాలని బీజేపీ వ్యూహాలు

దగ్గరైన రూరల్ ఓటింగ్ ఈ స్థాయిలో లేదు. ఇదే ధీమా కమలం పార్టీలో కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో గతంతో కంటే మా బలం పెరిగింది, ఇప్పుడు నెంబర్ గేమ్ లో మేము గెలుస్తామంటోంది. తెలంగాణ రూరల్ ఏరియాలో 38శాతం ఓటు బ్యాంక్ మాదేనంటూ కమలం పార్టీ కాన్ఫిడెన్స్ తో ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇప్పటికే రెండు దశలుగా స్థానిక ఎన్నికల వ్యూహాలపై వర్క్ షాపులు నిర్వహించింది బీజేపి. అంతేకాదు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందంటే అది కేంద్రం ఇచ్చే నిధులతోనే అనే విషయాలను బలంగా ఓటర్లకు చెప్పే ప్రయత్నం చేస్తోంది. ఈ సారి బిజేపికి అవకాశం ఇస్తే గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామనే అంజెడాతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైయ్యింది. కేంద్రం ఇచ్చే నిధులను గ్రామాల అభివృద్ధికి వాడకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు దారిమళ్లిస్తున్నాయని ఆరోపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయి వరకూ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తామని, అవినీతికి తావులేని పాలన అందిస్తామని క్షేత్రస్థాయిలో వినత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది.అంతేకాదు కాంగ్రెస్, బిఆర్ఎస్ లో సీటు దక్కని అభ్యర్ధులను పార్టీలోకి ఆహ్వానించి, బరిలోకి దింపేందుకు వ్యూహత్మకంగా ముందుకు వెళుతోంది తెలంగాణ బిజేపి. ఇదిలా ఉంటే వచ్చే అంసెబ్లీ ఎన్నికల్లో బిజేపి నుండి ఎమ్మెల్యే సీటు ఆశించ్టే అభ్యర్ధులను సైతం అవసరమైతే జెడ్పీటీసీ లుగా ఈ ఎన్నికల్లో పోటీలో నిలిపేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## పాకిస్తాన్‌ను మ్యాప్‌లో లేకుండా చేస్తాం

లేదా అని ఆలోచించేలా చేసే పని చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇందుకు సైనికులు కూడా సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. దేవుడు కోరుకుంటే, మీకు త్వరలో అవకాశం లభిస్తుందంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అసాధారణంగా పనిచేసిన ముగ్గురు అధికారులను ఆర్మీ చీఫ్ ఇవాళ సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ 140వ బెటాలియన్ కమాండెంట్ ప్రభాకర్ సింగ్, రాజ్‌పుతానా రైఫిల్స్ మేజర్ రితేష్ కుమార్ , హవల్దార్ మోహిత్ గైరా ఈ గుర్తింపు అందుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమాయక ప్రాణాలకు హాని కలిగించకూడదని, సైనిక లక్ష్యాలను నాశనం చేయకూడదని భావించామని, ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా కేంద్రాలు , వాటి సూత్రధారులను నిర్మూలించడంపై దృష్టి సారించామని ఆర్మీ చీఫ్ తెలిపారు. అప్పట్లో తమ విధ్వంసంపై ప్రపంచానికి ఆధారాలను ఇచ్చామన్నారు. తాము అలా చేయకపోతే పాకిస్తాన్ నిజాన్ని దాచిపెట్టి ఉండేదని ఆర్మీ ఛీఫ్ తెలిపారు

## అమరావతి పునర్నిర్మాణానికి ఎస్‌పీవీ

భేటీ జరిగింది. ఈ భేటీలో 21 అంశాల మీద మంత్రివర్గం చర్చించింది. అనంతరం పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.ఇందులో భాగంగా శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించడానికి ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకం కింద ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.15000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. విజయవాడలో సింగ్ నగర్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద సుమారుగా 2 లక్షల 90 వేల మంది లబ్ధిదారులకు రూ.435 కోట్ల మేరకు అకౌంట్లో డబ్బులు జమ చేయనున్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకంతో పాటుగా మరికొన్ని ప్రతిపాదనలకు కూడా ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ పాలసీ 2024-29కి సంబంధించిన అనుబంధ ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే అమృత్ పథకం 2.0 పనులకు, జలవనరుల శాఖకు సంబంధించి పనులకు, కారవాన్ పర్యాటకానికి ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది. అమరావతిలో చేపట్టిన వివిధ పనులను వేగంగా పూర్తి చేసేందుకు గానూ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి సంస్థలకు భూములు కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. మరోవైపు కుష్ఠు వ్యాధి పదం తొలగించేలా చట్టసవరణ చేయాలనే ప్రతిపాదనకు కూడా ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కార్మిక చట్టాల్లో సవరణలకు, విద్యుత్ శాఖ ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుతో ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గుతోందని.. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారంటూ వారి నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్ల కుటుంబాలకు అండగా ఉండాలని, ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సేవలో పథకం ప్రారంభించనుంది. గతంలో వాహన మిత్ర పేరుతో ఈ పథకం అమల్లో ఉండేది. వైసీపీ హయాంలో వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.10000 అందించేవారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఆటో డ్రైవర్ల సేవలో అని మార్చి మొత్తాన్ని కూడా రూ.15000 లకు పెంచింది.

### తెలుగు రాష్ట్రాల సీఎంలకు
## బండారు దత్తాత్రేయ పిలుపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమన్వయంతో ముందుకు సాగాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో తన కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉభయ రాష్ట్రాల అభివృద్ధి విషయంలో ఒకరికొకరు ఆటంకాలు కలిగించకూడదని సూచించారు. ఎన్ని సమస్యలు వచ్చినా పరస్పరం పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అలయ్'-బలయ్'తో తెలుగు ప్రజలంతా కలిసి ఉండే వాతావరణం నిర్మాణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణయం ఎప్పుడంటే.?

ఆమోదించాలని కోరనున్నట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. తనకు గులాబీ పార్టీతో ఇక ఎలాంటి సంబంధం లేదని స్పష్టత ఇచ్చారు. దీంతో ఆమె కొత్త పార్టీపై ఊహాగానాలు ప్రచారానికే పరిమితమయ్యాయి. అంతే తప్ప అధికార ప్రకటన ఇంత వరకూ వెలువడకపోవడంతో ఆమె వెంట ఉన్న వాళ్లు సయితం ఒకింత డీలాలో పడ్డారని చెబుతున్నారు.

### తిరిగి చేర్చుకుంటారని..

కల్వకుంట్ల కవితను తిరిగి బీఆర్ఎస్ లో చేర్చుకుంటారన్న ప్రచారం మొన్నటి వరకూ జరిగింది. కేవలం సస్పెండ్ మాత్రమే చేశారు కాబట్టి కేసీఆర్ తిరిగి ఆమెను పార్టీలోకి తీసుకోవడం ఖాయమని అనుకున్నారంతా. కానీ కవిత మాత్రం తనకు, బీఆర్ఎస్ తో సంబంధం లేదని తేల్చి చెప్పడంతో బీఆర్ఎస్ అగ్ర నేతలు కూడా కవిత సస్పెన్షన్ విషయమై ఆలోచించే అవకాశముండకపోవచ్చు. అయితే కల్వకుంట్ల కవిత తదుపరి కార్యాచరణపై మాత్రం ఇంకా క్లారిటీ రాకపోవడంతో ఆమె కదలిక ఎటు వైపు ఉంటుందన్న దానిపై అనేక మంది ఆసక్తితో రాజకీయంగా చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని కవిత వెంట ఉన్న వారు గట్టిగా భావిస్తున్నారు. అయితే కవిత తర్వలోనే దీనిపై స్పష్టత ఇస్తారని కూడా అంటున్నారు.

### జాగృతినే కొనసాగిస్తారా.?

కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ స్థాపిస్తారా.? తెలంగాణ జాగృతిని పార్టీగా ప్రకటిస్తారా.? లేక ఇంకొంత కాలం ఇలాగే జాగృతి సంస్థ ద్వారా రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తారా.? అన్నదానిపై రెండు, మూడు రోజుల్లో కవిత స్పష్టత ఇచ్చే అవకాశముంటుందని అంటున్నారు. తెలంగాణ రాష్ట సమితి మాదిరిగానే కొన్నేళ్ల తర్వాత జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే ఆలోచనలో కవిత ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొత్తపార్టీ స్థాపనపై ఇంకా కవిత స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు కనిపించకపోవడంతో ఆమె వెంట ఉన్న వాళ్లు ఒకింత అయోమయంలో ఉన్నట్లు కనిపిస్తుంది. తన తండ్రి కూడా అనేక మంది మేధావులు తెలంగాణ వాదులతో చర్చించి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతనే నాడు టీఆర్ఎస్ ను రాజకీయ పార్టీగా మలిచారని ఈ మధ్య కవిత ఒక సందర్భంలో వ్యాఖ్యలు చేశారని గుర్తు చేస్తున్నారు.

### అన్ని ఎన్నికల్లో పోటీ చేయాలని..

తాను కూడా అందరితో చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు వరసగా ఉండటంతో ఒకవేళ పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో అనుకున్నట్లు జరిగితే రెండు మూడు చోట్ల కూడా ఉప ఎన్నికలు వచ్చే అవకాశంకూడా లేకపోలేదు.

ఇంకా పార్టీ స్థాపనపై జాప్యం చేస్తే.. వెంట ఉన్నవారు ఎంతకాలం ఇలా జాగృతి సంఘంలో కొనసాగుతారనేది ప్రశ్న కలుగుతుంది. అయితే కల్వకుంట్ల కవిత తన వెంట నడిచే వారికి అన్యాయం చేయరని, జాగృతి సంస్థ ద్వారానే రానున్న అన్ని ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. కల్వకుంట్ల కవిత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడానికి, ప్రచారం చేయడానికి ఇది మంచి అవకాశంగా కూడా భావిస్తున్నారట. దీనిపై మరో రెండు మూడు రోజుల్లో క్లారిటీ రానుంది.

## విజయ్ ప్రచార సభ తొక్కిసలాట ఘటన

చెన్నై (ప్రశ్న న్యూస్) సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రచార సభ సందర్భంగా సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐపీఎస్ అధికారిణి ఆస్రా గార్గ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు మద్రాస్ హైకోర్టు శుక్రవారం సిట్‌ను ఏర్పాటు చేసింది. తొక్కిసలాటకు సంబంధించిన వీడియోలను చూస్తుంటే హృదయం ద్రవిస్తోందని జస్టిస్ ఎస్. సెంథిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ఇద్దరు వ్యక్తులను మాత్రమే అరెస్టు చేయడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజలను, పిల్లలను రక్షించడంలో విఫలమైనందుకు, ఈ సంఘటనకు బాధ్యత వహించనందుకు విజయ్ పార్టీని, ఆ పార్టీ నాయకులను, నిర్వాహకులను హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.ఈ దుర్ఘటన పట్ల రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, అన్ని రాజకీయ పార్టీలు విచారం వ్యక్తం చేశాయని, అయితే నిర్వాహకులు మాత్రం ఈ సంఘటనకు బాధ్యత వహించకుండా దూరంగా ఉండటం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. తొక్కిసలాట కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను దర్యాప్తు ప్యానెల్‌కు అందజేయాలని జస్టిస్ సెంథిల్ కుమార్ కరూర్ పోలీసులను ఆదేశించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విజయ్ పట్ల ఉదాసీనత ప్రదర్శిస్తోందని హైకోర్టు మండిపడింది. కరూర్‌లో జరిగిన దానిని ప్రపంచమంతా చూసిందని పేర్కొంది. పెద్ద సంఖ్యలో జనాలు వస్తారని తెలిసినప్పుడు అందుకు తగినట్లుగా ఏర్పాట్లు ఉండాలి కదా అని టీవీకే పార్టీని, పోలీసులను ప్రశ్నించింది.మరోవైపు, టీవీకే నాయకులు బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్ కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఆదేశాలను హైకోర్టు రిజర్వ్ చేసింది.

## హైవేలపై క్యూఆర్ కోడ్ బోర్డులు

రహదారి నంబర్, ప్రాజెక్ట్ పొడవు, నిర్మాణ, నిర్వహణ కాలం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు హైవే పెట్రోలింగ్, టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి అధికారుల ఫోన్ నంబర్లు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1033 కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా, సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాకు ఉన్న దూరం, ట్రక్కుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, పంక్చర్ షాపులు, వాహన సర్వీస్ స్టేషన్లు, ఈ-ఛార్జింగ్ స్టేషన్ల వివరాలను కూడా ఈ కోడ్ ద్వారా పొందవచ్చని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది.ప్రయాణికులకు సులభంగా కనిపించేలా ఈ బోర్డులను టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాలు, రహదారి ప్రారంభ, ముగింపు పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ విధానం రహదారి భద్రతను పెంచడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందిస్తుందని, జాతీయ రహదారులపై అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్‌హెచ్ఏఐ తన ఆస్తుల మానిటైజేషన్ ద్వారా 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 35,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్ల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ఒక నివేదికలో అంచనా వేసింది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 24,399 కోట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని, బడ్జెట్ లక్ష్యమైన రూ. 30,000 కోట్లను కూడా అధిగమిస్తుందని తెలిపింది.

## రేవంత్ రెడ్డిని వదిలి పెట్టను

అడ్డం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో ఓ టీవీ చానల్ తో మాట్లాడుతున్న సమయంలో "తెలంగాణ డీఎన్ఏ బిహార్ డీఎన్ఏ కంటే బెటర్, బిహార్ వాళ్ల డీఎన్ఏలోనే కూలీ పని ఉంది" అని రేవంత్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు బిహార్ ప్రజలను అవమానించినట్లుగా ఉన్నాయని బీజేపీ, ఆర్జేడీ, జేడీయూ వంటి పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రశాంత్ కిషోర్ సీరియస్ గా తీసుకున్నారు. "రేవంత్ బిహార్ ప్రజలను అవమానిస్తున్నాడు. బిహార్ వాళ్ల డీఎన్ఏ తక్కువ అంటే, మీరు మా సహాయం ఎందుకు అడిగారు?" అని ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు. రేవంత్ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఢిల్లీలో తనను మూడుసార్లు సంప్రదించి, ఎన్నికల వ్యూహాలకు సహాయం అడిగారని కూడా పీకే తెలిపారు. 2025 ఆగస్టులో బిహార్‌లో కాంగ్రెస్-ఆర్జేడీ కలిసి నిర్వహించిన 'వోటర్ అధికార్ యాత్ర'లో రేవంత్ రెడ్డి పాల్గొనడం ప్రశాంత్ కిషోర్‌కు ఆగ్రహం తెప్పించింది. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ 16 రోజుల యాత్రలో రేవంత్ ప్రచారం చేయడం బిహార్ ప్రజల అవమానమని ప్రశాంత్ కిషోర్ అప్పుడే ఖండించారు. "రేవంత్ బిహార్ వాళ్లపై దుర్మార్గ వ్యాఖ్యలు చేస్తాడు. బిహార్ గ్రామాలకు వస్తే, ప్రజలు అతన్ని తరిమికొడతారు" అని హెచ్చరించారు. రాహుల్ గాంధీ రేవంత్‌ను ఆహ్వానించడం "బిహార్ గౌరవానికి అవమానం" అని కూడా విమర్శించారు. ప్రశాంత్ కిషోర్ 2025లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీతో పోటీ పడుతున్నారు. ఆత్మగౌరవ నినాదం ద్వారా బిహార్ ప్రజల్లో తమ పార్టీకి మద్దతు పెంచుకోవాలని, కాంగ్రెస్‌పై రేవంత్‌తో లింక్ చేసి విమర్శలు రేకెత్తించాలని వ్యూహమని భావిస్తున్నారు. ప్రశాంత్ కిషోర్ తనను టార్గెట్ చేస్తూ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఇప్పటి వరకూ రేవంత్ రెడ్డి స్పందించలేదు.

### వరద ప్రభావిత ప్రాంతాల్లో
## సమన్వయంతో పనిచేయండి

సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలి" అని ఆయన నిర్దేశించారు. వరద తగ్గిన తర్వాత పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉంటాయని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అవసరమైతే సమీప జిల్లాల నుంచి పారిశుధ్య సిబ్బందిని తరలించి, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులపై ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో క్లోరిన్ కలిపిన సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు.

నీరు కలుషితం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ముంపునకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను జిల్లా యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించిందని అధికారులు సమావేశంలో వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు తన కార్యాలయానికి నివేదికలు పంపాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

### దామోదర్ రెడ్డి భౌతికకాయానికి
## రేవంత్ రెడ్డి నివాళి

పరామర్శించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా నివాళులర్పించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఆయనకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, కోలుకుని తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటారని తాము భావించామని అన్నారు. ఆయన మృతి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు.

### వైభవంగా
## 'అలయ్ బలయ్' వేడుక

మటన్, తలకాయ కూర, పాయ, బోటి, చికెన్, చేపల కూర, పచ్చి పులుసు, సర్వ పిండి వంటి రుచికరమైన వంటకాలతో అతిథులకు విందు ఏర్పాటు చేశారు. మరోవైపు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీముర్ము సందేశమిచ్చారు.

తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను ప్రతిబింబించే విధంగా అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోంది, ఇది సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతోందని కొనియాడారు. సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోందన్నారు. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోందని స్పష్టం చేశారు. అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి

### చింతలపూడి తహశీల్దార్ స్లీవరాజు

**ఏలూరు** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నట్టు బుధవారం చింతలపూడి తాహశీల్దార్ స్లీవరాజు అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చింతలపూడి మండలంలో మొత్తం 38 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, ఇప్పటివరకు 7 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, ఈరోజు ఐదు గ్రామాల్లో అనగా నామవరం, పొనుకుమాడు, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం గ్రామాల్లో ప్రభుత్వం జరిపిన రీ సర్వేలో గ్రామాల రైతు వారి భూములు కూడా రీ సర్వే పూర్తి చేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశించినీదని, పై గ్రామాల్లో ఈరోజు నుంచి గ్రామసభలు జరుగుతున్నాయని, ఈరోజు నాలుగు బృందాలుగా విడిపోయి ఆయా గ్రామాల్లో సర్వేయర్లు, వీఆర్వోల ద్వారా గ్రామ సభలు ఏర్పాటు చేసి వీటి ద్వారా రీ సర్వే చేయు విధానంపై అధికారులు రైతులకు తెలియజేస్తున్నారు .అధికారులు ప్రతి రైతు ల భూములు రీ సర్వే నిర్వహించి ఒకరోజు ముందు రైతులకు నోటీసు ఇస్తారని రైతుల భూమికి సంబంధించిన వారి హక్కు పత్రాలను సర్వేకు హాజరయ్యే ముందు పత్రాలు కలిగి ఉండాలని పత్రాలు చూపించిన ఎడల సర్వే చేసి రెవెన్యూ రికార్డులను మార్పు చేస్తారని వారన్నారు.అదేవిధంగా చింతలపూడి మండలంలో రేషన్ స్మార్ట్ కార్డులు వివిధ గ్రామాలకు సంబంధించిన సుమారు 2500 స్మార్ట్ కార్డులు ఉన్నాయని, మీ ఏరియా వీఆర్వో ని మరియు సంబంధిత రేషన్ ఎవరిది డీలర్లను గాని సంప్రదించి, మీ స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకువచ్చని, అలాగే 2025 ఓటర్ జాబితా మ్యాపింగ్ చేయవలసిందిగా భారత ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, బూత్ అధికారులు అందరూ 2002 సంవత్సరం ఓటర్ లిస్ట్ ను 2025 ఓటర్ లిస్ట్ కు మ్యాపింగ్ చేస్తున్నారు, కాబట్టి మండలంలోని ఓటర్లు అందరూ సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కె. దర్శన్, రీసర్వే డిటి డి. సంధ్య కుమారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సహాయం

**ఏలూరు** లింగపాలెం మండలం రంగాపురంలో సెయింట్ జోన్స్ ఒకేషనల్ సెంటర్ వ్యవస్థాపకులు, ఆస్ట్రియా దేశంలో సేవ చేస్తున్న రెవరెండ్ ఫాదర్ కె.యోహాను సుమారు 10 సంవత్సరాలుగా ఎంతో మంది చదువుకునే పిల్లలకు సంవత్సరానికి 2 సార్లుగా తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ సందర్భంగా రంగాపురం సెయింట్ జోన్స్ ఒకేషనల్ సెంటర్ లో శుక్రవారం పదవ తరగతి లోపు చదువుకునే విద్యార్థులకు 4,000/-రూపాయలు పదవతరగతి నుండి పైన చదువుకునే విద్యార్థులకు 8,000/- రూపాయలు అలాగే విభిన్న ప్రతిభావంతులకు 5,000/- రూపాయలు చొప్పున 70 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము, లింగపాలెం మండల ఎంఈఓ కె.రామారావు, ఎంఈఓ జె రవీంద్ర హాజరయ్యారు.విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా రంగాపురంలో వోకేషనల్ సెంటర్ ను ఏర్పాటు చేసి టైలరింగ్ కంప్యూటర్ శిక్షణ, మరియు స్పోకెన్ ఇంగ్లీష్, లాంటి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఫాదర్ యోహాను ని కొనియాడారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**సంగారెడ్డి** పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ గ్రామ శివారులోని గుర్తుతెలియని మృతదేహం లభ్యం. ఇస్నాపూర్ గ్రామంలోని సూర్యవంశం వెంచర్ వద్ద నీటిలో మృతిదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతి దేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

### బీమా డబ్బుల కోసం
## కన్నతల్లిదండ్రులు, భార్య హత్య



**లక్నో** బీమా డబ్బుల కోసం కన్నతల్లిదండ్రులు, భార్య హత్యఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం సంభల్ లో దారుణం. విశాల్ సింఘాల్ అనే వ్యక్తి తన తల్లి, తండ్రి, మొదటి భార్యలను బీమా డబ్బుల కోసం హత్య చేసాడు. తల్లి పేరిట ఉన్న రూ. 25 లక్షల బీమా, మొదటి భార్య పేరిట ఉన్న రూ. 80 లక్షల బీమా, తండ్రి పేరిట ఉన్న రూ. 50 కోట్ల విలువైన పాలసీల కోసం తండ్రిని హత్య చేసి రోడ్డు ప్రమాదాలుగా చిత్రీకరించాడు. నాల్గవ భార్య శ్రేయను కూడా జీవిత బీమా పాలసీలపై సంతకం చేయాలని బలవంతం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

## పల్నాడులో క్షుద్ర పూజల కలకలం

**పల్నాడు** మాచవరం మండలంలోని వేమవరం నుంచి చెన్నైపాలెం వెళ్లే రహదారిలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. మనిషి ఆకారంలో ముగ్గులు వేసి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. భయంకరంగా మనిషి రూపంతో పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేశారు. ఈ దృశ్యాలను చూసిన ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు దృష్టి పెట్టాలని ప్రజల కోరుతున్నారు.

# జనసేన పార్టీలో కీలక మార్పులు

## నాగబాబు పదవి రామ్ తాళ్లూరికి

**విజయవాడ :** జనసేన పార్టీ వ్యవహారాలను చూసే బాధ్యతలను రామ్ తాళ్లూరి కి అప్పగిస్తూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. రామ్ తాళ్లూరి ఇక నుంచి పార్టీ సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్వహిస్తారని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా రామ్ తాళ్లూరిని నియమించినట్లు అయింది. ఆయన పార్టీ అంతర్గత అంశాలను చూసుకుంటారని ప్రకటించారు. ఇప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు చూస్తున్న వ్యవహారాలు మొత్తం ఇక నుంచి రామ్ తాళ్లూరి చూస్తారు. ఇప్పటికే జనసేన పార్టీ ఐటీ విభాగాన్ని రామ్ తాళ్లూరినే చూసుకుంటున్నారు. నాగబాబు బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తూ పవన్ నిర్ణయం తీసుకున్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి ఆయన కలసి పని చేస్తున్నారు. తన నియామకంపై రామ్ తాళ్లూరి సంతోషం వ్యక్తం చేశారు. పవన్ ను మొదటిసారి కలిసిన రోజు నుంచి అదే ఉత్సాహం, ప్రజల కోసం అంకితభావం కొనసాగుతోందన్నారు. పార్టీ వ్యవహారాల కోసం నాగబాబు ఎక్కువ సమయం కేటాయించలేకపోవడం .. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణించాలని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారు. ఈ నియామకం అందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు. రామ్ తాళ్లూరి ఖమ్మంజిల్లాకు చెందిన ఎన్నారై. సినిమాలు కూడా నిర్మించారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందారు. రామ్ తాళ్లూరి అమెరికాలో లీడ్ ఐటీ కార్ప్ , ఫ్లై జోన్ ట్రాంపోలిన్ పార్క్, రామ్ ఇన్నోవేషన్స్ (రియల్ ఎస్టేట్) వంటి వ్యాపారాలను నడుపుతున్నారు. సినిమా రంగంలో రాఖీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సినిమాలు నిర్మించారు.

**పిఠాపురం జనసేనలో మర్రెడ్డి శ్రీనివాసరావు మార్పు తప్పదా?** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఇంచార్జ్ ఎవ్వరు అనేదానిపై పెద్ద డౌట్ వ్యక్తం అవుతోంది.. ఎందుకంటే పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తోన్న మర్రెడ్డి శ్రీనివాసరావును ఆ బాద్యతల నుంచి తప్పిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా జోరుగా సాగడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.. స్థానికంగా ఆయనపై పార్టీలో ఉన్న అసంతృప్తే ఆయన పెద్దగా చురుగ్గా ఉండడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.. అయితే ఆయనకు పార్టీ అధినేత నుంచి పుష్కలంగా ఆశీస్సులు ఉండడం, ఆయనపై అధిష్టానానికి సానుకూలత ఉండడంతో ఆయన ముందుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అయితే గత కొంత కాలంగా ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌పై వస్తున్న పుకార్ల ఈనేపథ్యంలోనే ఇటీవల నియోజకవర్గంలో పర్యటించిన జనసేన ముఖ్యనేత, ఎమ్మెల్సీ హరిప్రసాద్ విలేకరులు అడిగిన ప్రశ్నకు షాకింగ్ సమాధానం ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీలో ముందునుంచి అన్నీతామే వ్యవహరించిన వారిని పక్కన పెట్టారని, కొత్తగా వైసీపీలో నుంచి, ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారిని పార్టీలో ప్రాముఖ్యత ఇస్తున్నారని ముందునుంచి కొంత మందిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పలు సందర్భాల్లో బట్టబయల?ంది.. ఇది చేబ్రోలు సీతారామాలయంలోని జే గంట విషయంలో బయటపడింది. అయితే ఇటువంటి సందర్భాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, లేక ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఇలా ఎవరో ఒక నేతలు వచ్చి సర్ది చెప్పడం పరిపాటిగా మారింది..ఇక్కడ విషయాలన్నీ జనసేనాని దృష్టికి వెళ్లడం లేదని, తమ గోడు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదని చాలా మంది జనసేన పార్టీ నేతలే లోలోన మధనపడిన పరిస్థితులున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది..దీనికి తోడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థానికంగా లేకపోవడం, ఆయన ఏదైనా సమావేశాలుంటేనే హాజరయ్యే పరిస్థితి ఉండడం తమ ఇబ్బందులను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని జనసేన నేతలు వాపోయిన పరిస్థితి కూడా కనిపించింది.. ఈనేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మార్పు జరిగనుందా..? అందుకే నియోజకవర్గంలో ఈరకమైన వార్తలు హల్‌చల్ చేస్తున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి..

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఈ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేతో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవేకి మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసల నిర్మించి లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా- చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్లుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్- దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాలతో పాటు అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చుతుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల ఎంపిక తదితరాలను పరిశీలిస్తున్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పరిశీలన, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# వైసీపీ యూ టర్న్

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైసీస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎన్నికల్లో ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల కింది స్థాయి ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది.

రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి సమర్థవంతమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అసలు పార్టీ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లో అంచనా వేయడానికి కూడా ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని జగన్ భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే లోపు జిల్లా, నియోజకవర్గ, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో ఉండాలని నేతలకు జగన్ ఆదేశించారు. ఈ ఎన్నికల తర్వాత పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా వెంటనే దానికి స్పందన భారీగా వచ్చే అవకాశముందన్న అంచనాలో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

**కాకినాడ** ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే.ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది.వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వాటాల సమస్యలు తేలక పోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ముందుకు సాగలేదు. భూమి బదలాయింపు కాకపోవడంతో చాలామందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతు భరోసా వంటివి వర్తింపు కావడం లేదు. బ్యాంకు రుణాలు లభించడం లేదు. అవసరానికి భూమి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమలయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం కలగనుంది.అయితే సచివాలయాల్లో వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అక్కడ సిబ్బందికి శిక్షణ, కంప్యూటర్లు, పరికరాలు అవసరం అవుతాయి. అయితే వారానికి ఒకటి రెండు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది. అయితే సచివాలయాల్లోన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు భారీగా ఖర్చు కానుంది. ప్రజలకు సులభతరం చేసే పనిలో భాగంగా ప్రభుత్వంపై ఇప్పుడు ఆర్థిక భారం పడనుంది. అందుకే దీనిపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. కానీ గత ఏడాదిలో భారీగా వచ్చిన ఫిర్యాదులతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గ్రామ సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్ ఎంత వరకు విజయవంతం అవుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

# ఏపీకి వాయుగుండం

**విశాఖపట్టణం :** ఏపీకి భారీ వర్ష సూచన. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే రాయలసీమలో వర్షాలు దంచి కొడుతున్నాయి. తాజాగా ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో అతి భారీ వర్షాలు పడనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తాజాగా అల్పపీడనం ఏర్పడింది. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఈ తెల్లవారుజామున 6 గంటల సమయానికి విశాఖకు 300, ఒడిస్సా లోని గోపాల్పూర్ కు 310, పారాదీప్ నకు 400 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. గంటకు పది కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోంది. నేటి రాత్రికి గోపాల్ పూర్– పారాదీప్ మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిస్సా తీరాల మధ్య దాటి అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది.వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయి. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదు కానుంది. మిగతా జిల్లాల్లో మాత్రం తేలికపాటి వానలు కొనసాగనున్నాయి.వాయుగుండం తీరం దాటే క్రమంలో భారీ ఈదురుగాలులు కొనసాగనున్నాయి. గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. శనివారం వరకు మత్స్యకారులు చేపల వేట కోసం వెళ్లకూడదని అధికారులు సూచించారు. మరోవైపు చాలా జిల్లాల్లో పిడుగుల వాన పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీచేస్తోంది. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. కాగా వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో కుండపోతగా వర్షం పడుతోంది. ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటనుండడంతో విస్తారంగా వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది.

## బెంగళూరు దాటని జగన్

**కడప :** వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయం అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. కానీ ఆయన క్షేత్రస్థాయిలో చేస్తున్న ప్రయత్నాలలో చాలా రకాల లోపాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన రాష్ట్రంలో ఉండడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది మొదలు ఆయన ఎక్కువగా బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అక్కడ నుంచి తాడేపల్లి కి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రారంభంలో వారంలో నాలుగు రోజులు పాటు తాడేపల్లిలో ఉండేవారు. అయితే అది క్రమేపి రెండు రోజులకు పడిపోయింది. ఒక్కోసారి తాడేపల్లి కి కనిపించకుండా కూడా మానేశారు. అయితే గతంలో ఇదే జగన్మోహన్ రెడ్డి అండ్ వైసీపీ శిబిరం చంద్రబాబుపై తరచూ ఒక ఆరోపణ చేసేది. చంద్రబాబుతో పాటు లోకేష్ హైదరాబాదులో ఉండి మాట్లాడుతున్నారని ఆరోపించేవారు. ఇప్పుడు అదే పని జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారు. అయితే టిడిపి కూటమి నేతలు ప్రశ్నించడం లేదు కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులే దీనిపై ఎక్కువగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి.వారం రోజుల కిందట జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ప్రారంభించారు. ఎక్కడైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కూటమి నుంచి ఇబ్బందులు ఎదురైతే.. డిజిటల్ బుక్ లో వివరాలు నమోదు చేసుకోవాలని.. అధికారంలోకి వస్తే వారందరినీ సప్త సముద్రాలు అవతల ఉన్న తెచ్చి చర్యలు తీసుకుంటామని జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అయితే ఆ డిజిటల్ బుక్ ను తెరిచి పార్టీ కార్యకర్తలకు చూపించి బెంగళూరు వెళ్ళిపోయారు. తరువాత ఆ డిజిటల్ బుక్ వ్యవహారం అనేది ఏంటి? ఎలా తీసుకెళ్లాలి? అనేది మాత్రం వివరించే ప్రయత్నం చేయలేదు. అసలు ఈ వారం బెంగళూరు నుంచి తాడేపల్లి కి రాలేదు. అటు నుంచి అటే యూరప్ పర్యటనకు వెళ్లనున్నారు జగన్మోహన్ రెడ్డి దంపతులు. అంటే మరో నెల రోజుల పాటు జగన్మోహన్ రెడ్డి అందుబాటులో ఉండరన్నమాట.అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి విడిచి బయటకు వెళ్లేవారు కాదు జగన్మోహన్ రెడ్డి. బెంగళూరు ముఖం కూడా చూసేవారు కాదు. కానీ ఇప్పుడు బెంగళూరును పట్టుకొని వేలాడుతున్నారు. అక్కడే ఎలహంక ప్యాలెస్ లో ఎక్కువగా విడిది చేస్తున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు జిల్లాల పర్యటన కూడా చేసేవారు కాదు. ప్రతిపక్షంలోకి వచ్చాక చేస్తామని చెప్పారు. కానీ తాడేపల్లికి వచ్చి ప్రెస్ మీట్ లు పెడుతున్నారు. చంద్రబాబును తిట్టడానికి పరిమితం అవుతున్నారు. ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ప్రస్తావించే సాహసం చేయడం లేదు. ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. జగన్మోహన్ రెడ్డి ఈ తరహా ప్రదర్శన, దూకుడుతో కూటమిని అడ్డుకోలేరని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# రావిపూడి అనిల్‌తో నవీన్ సినిమా ఫైట్

**హైదరాబాద్ :** ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని? ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందింది?ఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మధనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకి మధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగనగా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు.నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమంది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్ గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లను ఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తన సినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియాలో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి.

# దేవరగట్టు బన్నీ ఉత్సవంలో తీవ్ర విషాదం

## దేవరగట్టు బన్ని ఉత్సవంలో ఇద్దరు మృతి..

**- 100 మందికి గాయాలు**



**కర్నూలు** హ్పాళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని జైత్రయాత్రలో హింస చెలరేగింది. కర్రల సమరంలో ఇద్దరు బలి అయ్యారు. వంద మందికి పైగా గాయాలు అయ్యాయి. మృతులు అరికెరికి చెందిన తిమ్మప్ప, కర్ణాటకకు చెందిన బసవరాజు. గాయపడ్డ వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుంది. బాధితులకు ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మాళమల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను దక్కించుకునేందుకు పోటీ లో ఈ ఘటన జరిగింది. బన్నీ ఉత్సవానికి రెండు లక్షల మంది తరలివచ్చారు. కర్రలతో కొట్టుకొనే క్రమంలో తీవ్ర గాయాలపాలై మరణాలు సంభవించాయి.

# తీరం దాటిన తీవ్రవాయుగుండం



**విశాఖపట్నం** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశా గోపాల్ పూర్ సమీపంలో తీరం దాటింది. ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ బలహీనపడుతోంది. తీరం దాటిన కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం కొనసాగనుంది. శుక్రవారం ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు అధికారులు జారీ చేసారు. విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసారు.

# మన్యం జిల్లాలో ప్రకృతి బీభత్సం

**విశాఖ**పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒడిశా-ఆంధ్ర సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో వరద బీభత్సంకొనసాగుతోంది. చంపావతి నది పొంగి ప్రవహిస్తుంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# ప్రముఖ రచయిత లల్లాదేవి కన్నుమూత

లల్లాదేవి గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ రచయిత పరుచూరి నారాయణాచార్యులు కన్నుమూశారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. గతకొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి రెండు గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. 1980వ దశకంలో మంచి పాపులారిటీ ఉన్న రచయితలలో లల్లాదేవి కూడా ఒకరు. పాములపై పరిశోధన చేసిన ఏకైక రచయితగా ఆయనకు పేరు. పలు తెలుగు సినిమాలకు కూడా రచయితగా ఆయన పనిచేశారు. 2004లో విడుదలైన శ్వేత నాగు చిత్రానికి కథా రచయిత లల్లాదేవే. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకి ఆయన అత్యంత సన్నిహితులు. కొంతకాలం ఆయన దగ్గర కార్యదర్శిగా కూడా లల్లాదేవి పనిచేశారు. వారి మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేశారు. వారి స్వగ్రామం గుంటూరు జిల్లా పత్తిపాడు సమీపంలోని నిమ్మగడ్డవారిపాలెం. ఇప్పటి వరకు ఆయన దాదాపు 250 పై చిలుకు నవలలు రాశారు. కొన్ని వందల కథలు, నాటికలు, నాటకాలు కూడా రాశారు. ప్రముఖ దిన, వార పత్రికలలో సీరియల్ గా కూడా ప్రచురితమయ్యాయి.

# 26 నుంచి చైనాకు విమాన సర్వీసులు

**న్యూఢిల్లీ,**కోవిడ్-19 , గల్వాన్ లోయలో సైనికుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా ఐదేళ్లుగా నిలిచిపోయిన భారత్-చైనా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2న భారత విదేశాంగ శాఖ ఈ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి విమాన సేవలు మొదలవుతాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. పర్యాటకం, వాణిజ్యం, వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యం. ఇండిగో కోల్‌కతా-గ్వాంగ్జూ సర్వీసులను ప్రకటించింది.కరోనా వైరస్ వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్, చైనాల మధ్య ఐదేళ్లుగా నిలిచిపోయిన విమాన సర్వీసులు.. పునఃప్రారంభం కానున్నాయి. ఇరు దేశాల మధ్య ఈ అంశంపై పలు దఫాలుగా చర్చలు జరిగాయి. తాజాగా డైరెక్ట్ విమానాల పునఃప్రారంభానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్టు భారత విదేశాంగశాఖ అక్టోబరు 2న ప్రకటించింది. వింటర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకొని.. ఈ నెల చివర నాటికి వివిధ నగరాల మధ్య విమాన సర్వీసులు పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలకు చెందిన ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసుకుంటాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇరు దేశాల పౌరవిమానయాన అధికారుల మధ్య సాంకేతికస్థాయి చర్చలు జరిగినట్టు తెలిపింది. దీంతో అక్టోబరు 26 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.మధ్య సరిహద్దుల్లో ఐదేళ్ల నుంచి నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ- చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లు, ఇరు దేశాల విదేశాంగ శాఖ అధికారుల మధ్య జరిగిన భేటీల్లో దీనిపై ప్రధానంగా చర్చించారు.. గత కొద్ది నెలలుగా భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం ప్రధాని చైనా వెళ్లినప్పుడు విమాన సేవల పునఃప్రారంభానికి సూత్రప్రాయంగా అంగీకరించాయి.

తాజాగా, అవగాహనకు రావడంతో ఐదేళ్ల తర్వాత భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలుకానున్నాయి.ఇక, విదేశాంగ శాఖ ప్రకటన వెలువడిన కాసేపటికే చైనాకు విమాన సర్వీసుల పునఃప్రారంభంపై ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఇండిగో ప్రకటన చేసింది. కోల్‌కతా నుంచి గ్వాంగ్జూ మధ్య అక్టోబరు 26 నుంచి రోజూ నాన్-స్టాప్ సర్వీసులు నడుస్తాయని తెలిపింది. డీజీసీఏ నిబంధనలకు లోబడి ఢిల్లీ-గ్వాంగ్జూ విమానాలను త్వరలోనే నడుపుతామని పేర్కొంది.ఇరు దేశాల మధ్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, సరిహద్దు వాణిజ్యం, వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య మార్గాల పునఃస్థాపనలో భాగంగా ఇండిగో తన ఎయిర్‌బస్ ఎ320 నియో విమానాలను ఉపయోగిస్తుందని తెలిపింది. ఇరుదేశాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వ్యాపార, పర్యటక, విద్యా రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. దౌత్యపరమైన సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన ఉద్రిక్తతల తగ్గుముఖం పట్టడానికి సంకేతంగా భావిస్తున్నారు. అమెరికా-భారత్ వాణిజ్య చర్చలు, డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. ఎస్‌సీఓ భేటీ అనంతరం మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మోదీ, జిన్‌పింగ్‌లు కలిసి ఫోటోలు దిగారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కసువెళ్లగక్కడం గమనార్హం.

# పదవికోసంకాదు.. మార్పుకోసం..!!

**- స్థానిక సంగ్రామానికి యువరాజులు"సై"..**

**- వార్డు సభ్యులు మొదలుకొని జడ్పీటీసీ వరకు పోటీకి సిద్ధం..**

**- రిజర్వేషన్ల ప్రకటనతో యువకుల్లో నూతన ఉత్సాహం..**






జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 03: గ్రామీణ రాజకీయాల్లో కొత్త గాలి వీచనుంది. ఎన్నాళ్లుగానో పెద్దల ఆధిపత్యం కొనసాగుతున్న పంచాయతీ రాజ్ వ్యవస్థలో, ఈసారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత తమ ముద్ర వేసేందుకు రెడీ అయినారు. కేవలం పక్కన నిలబడి చూడటం కాదు. నేరుగా బరిలోకి దిగి తమ సత్తా చాటుకోవాలని ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. గ్రామ వార్డు సభ్యత్వం నుంచి మొదలుకొని సర్పంచ్, మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ టెరిటోరియల్ కానిస్టిట్యుయెన్సీ (జడ్పీటీసీ) పదవుల వరకు యువరాజులు పోటీకి సిద్ధమవుతున్నారు.

**- మార్పు ర్పు కోసం పోటీ..పదవి కోసం కాదు.**

గ్రామాలలో పాత పద్ధతులు, పాత విధానాలు, ఒకే తరహా పాలన కొనసాగకుండా, కొత్త ఆలోచనలతో, ఆధునిక దృక్పథంతో, ప్రజలకు చేరువ అయ్యే నాయకత్వం కోసం యువత ముందుకొస్తోంది. ఇప్పటికే చాలా మంది యువ అభ్యర్థులు గ్రామ వీధులలో పాదయాత్రలు చేస్తూ, ప్రజల సమస్యలు నేరుగా వింటూ, చిన్న చిన్న సేవా కార్యక్రమాలతో ప్రజల్లో పట్టు సాధిస్తున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, వ్యవసాయం, ఉపాధి వంటి అంశాలపై చర్చలు మొదలుపెట్టి, ప్రజలకు తమ అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తున్నారు.

**- సామాజిక అనుబంధం పెంచే ప్రయత్నం..!**

యువ అభ్యర్థులు పుట్టిన రోజులు, జయంతులు, వివాహాలు, శుభకార్యాలు, క్రీడా పోటీలు వంటి ప్రతి సందర్భంలో పాల్గొంటూ ప్రజలతో బంధం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పెద్దలు, మహిళా సంఘాలు, రైతు సమితులు, స్వచ్ఛంద సంస్థలతో కలసి కూర్చొని, వారి సమస్యలు, అవసరాలు, ఆశలు తెలుసుకుంటున్నారు. "పదవి కోసం కాదు మార్పు కోసం పోటీ" అన్న నినాదంతో ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు.

**- గ్రామ పెద్దల అంచనా.!**

ఈసారి యువత ఎక్కువ సంఖ్యలో బరిలోకి దిగితే, గ్రామ రాజకీయాల్లో కొత్త నాయకత్వం అవతరించబోతుందని పెద్దలు చెబుతున్నారు. "పాత పద్ధతులను పక్కనపెట్టి, కొత్త ఆలోచనలు, కొత్త ఉత్సాహం, సేవాభావం కలిగిన నాయకులు వస్తే గ్రామాభివృద్ధి వేగం పెరుగుతుంది" అని వారు అభిప్రాయపడుతున్నారు.

**- యువత లక్ష్యం.!**

"మాకు రాజకీయ అనుభవం తక్కువ కావచ్చు కానీ గ్రామం పట్ల ప్రేమ, ప్రజల పట్ల అంకితభావం ఎక్కువ" అని చెబుతున్న యువరాజులు, తమ ఊరి ప్రతిష్టను పెంచడం, ప్రజల అవసరాలను తీర్చడం, ప్రతి వర్గం మద్దతు పొందడం తమ లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ముందుగానే మైదానంలోకి దిగిన వారు, పాదయాత్రలతో, ప్రజా భేటీలతో, సామాజిక సేవా కార్యక్రమాలతో చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**- భవిష్యత్ దిశ.!**

రిజర్వేషన్ ప్రకటన వెలువడిన తర్వాత రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. అభ్యర్థులు తుది నిర్ణయాలు తీసుకుని, పూర్తి స్థాయి ప్రచార యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుంటారు.

గ్రామ వీధుల నుంచి రాజకీయ వేదికల వరకు కొత్త తరంగం ఎగసిపడబోతోందని స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో యువత సత్తా చాటితే, భవిష్యత్ పంచాయతీ రాజ్ పాలనలో వారి పాత్ర మరింత బలపడనుంది.

## చిత్తూరు జిల్లా అంబేద్కర్ విగ్రహ ఘటనపై సీఎం ఆరా

చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. జరిగిన నష్టంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విగ్రహానికి ఆనుకుని ఉన్న షెడ్డుకు ఆగంతకులు రాత్రి నిప్పు పెట్టడటంతో అంబేద్కర్ విగ్రహానికి నష్టం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. జాతీయ నేతల విగ్రహాలకు అవమానం జరిగేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటిన తీవ్ర వాయుగుండం

**విశాఖపట్నం** బంగాళాఖాతంలోని ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం ఉదమయం ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటింది. కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం పడనుంది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్అలర్ట్ జారీ చేసారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరంలో ఫ్లాష్ ఫ్లడ్స్ లకు ఆవకాశముంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం వుంది. కాకినాడ, కోనసీమ, తూ.గో, ఏలూరులో భారీ వర్షాల సూచనుంది. ప్రధాన పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం, గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం వుంది.

## కేంద్రీయ వి35ద్యాలయం వనపర్తి జిల్లాకు మంజూరు.

**వనపర్తి :** వనపర్తి జిల్లా కేంద్రానికి పేదింటి విద్యార్థిని విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆర్థిక భారాలు మోయలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులకు సెంట్రల్ సిలబస్ ఉన్నత చదువులు చదివి గొప్ప గొప్ప ఉద్యోగాలు పొందడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి పట్టణానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి కృషి చేసిన పోతుగంటి రాములు మాజీ ఎంపీ , ఎంపీ డీకే అరుణమ్మ , బిజెపి ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు డి నారాయణ , కేంద్రీయ విశ్వవిద్యాలయం దాదాపు 120 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి జిల్లా కేంద్రానికి రావడానికి కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఉందే కోటి అంజి తెలియజేయడం జరిగింది.

## దుకాణం సముదాయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే.

**వనపర్తి :** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి పట్టణంలో పలు దుకాణ సముదాయాలను ప్రారంభించారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు వాటర్ ప్రూఫ్ సొల్యూషన్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు.యువకుడు ఏర్పాటు చేసుకున్న ఈ దుకాణాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.అనంతరం కొత్తకోట రోడ్డు ఖీూ ఆఫీస్ పక్కన ఆత్మకూరు మండలానికి చెందిన మహేష్ ఏర్పాటు చేసుకున్న చాయి దుకాణం ఎమ్మెల్యే ప్రారంభించారు.వనపర్తి పట్టణం న్యూ టౌన్ కాలనీకి చెందిన జ్యోతి కొత్త బస్టాండు వెనకాల ఏర్పాటు చేసుకున్న జ్యోతి బ్యూటీ పార్లర్ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఉన్నత చదువులు చదివిన నేటి యువత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే ఇలాంటి స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా భవిష్యత్తు బాగుంటుందని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పూడురులో జెండా వివాదం

# పోలీస్ పహారాలో దసరా వేడుకలు





మేడ్చల్( ప్రశ్న న్యూస్) దసరా వేడుకలు ఉద్రిక్తతకు దారి తీశాయి.మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో పోలీస్ పహారాలో దసరా వేడుకలు జరిగాయి.పూడూరు గ్రామంలో ప్రతి దసరాకు జెండా ఎగురవేసి జమ్మి చెట్టు పూజ చేసి,రావణ దాహనం చేయడం అనవాయితీగా వస్తోంది.ఇక్కడ గతంలో మజ్జిగ సుధాకర్ రెడ్డి కుటుంభీకులు (పటేల్, పట్వారి) జెండాను ఎగుర వేయగా,2019 లో పూడూరు గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన బాబు యాదవ్ ఎదురు తిరిగారు.

**2019 నుంచి జెండా వివాదం**

పటేల్,పట్వారీ వ్యవస్థను 1984లోనే అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రద్దు చేశారని,2019లో గెలుపొందిన గ్రామ సర్పంచ్ యాదవ్ ప్రశ్నించారు.గ్రామంలో సర్పంచ్ గా గెలుపొందిన వారే జెండాను ఎగురవేయాలని సూచించారు.అయినా పటేల్ పట్వారి కుటుంబానికి చెందిన మజ్జిగ సుధాకర్ రెడ్డి కుటుంభీకులు వినలేదు.దీంతో పూడూరులో అప్పటి నుంచి సర్పంచ్ ఒక జెండా,పటేల్ పట్వారీ కుటుంబానికి చెందిన వారు మరో జెండాను ఎగురవేస్తూ వస్తున్నారు. రెడ్డిలు,బీసీ,ఎస్సీ,ఎస్టీలు వేర్వేరుగా రెండు జెండాలు ఎగుర వేయడంతో ప్రతి సంవత్సరం దసరా రోజున ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుంది.

**గతేడాది ఒప్పందం..**

జెండా సందర్భంగా తలేత్తుతున్న వివాదాలను పరిష్కరించేందుకు గతేడాది మేడ్చల్ అప్పటి ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపల్ కమీషనర్ బి.నాగిరెడ్డి,తహసీల్దార్ శైలజ లు గ్రామస్థులతోచర్చించి,ఇరు వర్గాల మధ్యన సయోధ్య కుదిర్చారు.పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు అయినందున ప్రజాప్రతినిధి గానీ,లేదా అధికారి జెండా ఎగురవేయాలని నిర్ణయించారు.దీంతో 2025, దసరా నుంచి జెండా ఎగురవేయబోమని,ఎవరు పదవిలో ఉంటే వారు లేక సంబంధిత అధికారి మాత్రమే జెండా ఎగురవేసేందుకు తమకు అభ్యంతరంలేదనిఅంగీకరిస్తూ మజ్జిగ సుధాకర్ రెడ్డి కుటుంబం రాసుకున్న ఒప్పందంపై సంతకం చేశారు.

**ఒప్పంద ఉల్లంఘన..**

గతేడాది దసరాకు ముందు అధికారుల సమక్షంలోచేసుకున్న ఒప్పందాన్ని మజ్జిగ కుటుంభీకులు ఉల్లంఘించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో ప్రజా ప్రతినిధి ఎవరు లేనందున ఈ ఏడాది కూడా తామే జెండాను ఎగుర వేస్తామని అనడంతో గురువారం సాయంత్రం పూడూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.జెండాను బీసీలు అడ్డుకుంటారని సమాచారం అందుకున్న పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.ముందు జాగ్రత్తగా పూడూరు మాజీ సర్పంచ్ బాబు యాదవ్ తోపాటు పలువురిని ఆదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

**పూడూరులో ఆరాచకం.**

రాష్ట్రంలో పటేల్,పట్వారి వ్యవస్థ రద్దు అయినా పూడూరు గ్రామంలో ఇంకా కొనసాగుతుందని మాజీ సర్పంచ్ బాబు యాదవ్ అన్నారు.గ్రామంలో 200 మంది మాత్రమే ఉన్న రెడ్డి కులస్థులు,4వేల మంది ఉన్న ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీ కులస్థులను శాసిస్తున్నారని మండి పడ్డారు.గతేడాది చేసుకున్న ఒప్పందం ప్రకారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో మేడ్చల్ కమీషనర్ ను జెండా ఎగురవేసేందుకు ఆహ్వానించామని,మజ్జిగ కుటుంభీకులు కమీషనర్ను రాకుండా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.పూడూరు గ్రామ పరిధిలోనే నివాసం ఉంటున్న స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ జెండా ఎగుర వేసేందుకు ఆహ్వానించినా.. ఆయన సుముఖత వ్యక్తం చేయలేదన్నారు.ఒప్పందం ఉల్లంఘించిన వారిని కాకుండా మమ్మల్ని పోలీసులు దసరా రోజున ఆరెస్టు చేసి,నిర్బంధించడం సముచితం కాదని బాబు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## శాంతి తోనే అభివృద్ధి సాధ్యం



ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని హైదరాబాద్ అక్టోబర్ 3 మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకుని రోడ్ నెంబర్ వన్ కెపిహెచ్బి కాలనీ హైదరాబాద్ నందుగల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సందర్భంగా డాక్టర్ పద్మిని గారు మాట్లాడుతూ గాంధీ బోధించిన అహింస శాంతి మార్గంతో ఆ రోజుల్లో ఏ విధంగా స్వాతంత్రాన్ని సంపాదించుకున్నాము అలాగే శాంతితో ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుని సన్మార్గ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలలో గాంధీ బోధించిన శాంతి మార్గాన్ని విద్యార్థుల్లో ప్రభావితం చేసే విధంగా పాఠ్యాంశాలుగా మరింతగా ప్రవేశపెట్టాలని కోరారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ సామాజికవేత్తలు వేల్పూర్ శ్రీనివాస్ విజయదేవి తదితరులు పాల్గొన్నారు

## దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు



**హైదరాబాద్,** దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

### కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన

## ప్రపంచ చిరునవ్వు దినోత్సవం ?



స్థానిక రమణయ్య పేట లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ చిరునవ్వు దినోత్సవం సందర్భంగా పిల్లలకు బ్రష్ లు పేస్ట్ లు అందజేశారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "ప్రపంచ చిరునవ్వు దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ మొదటి శుక్రవారం జరుపుకుంటారని, ఈ దినోత్సవాన్ని ప్రఖ్యాత 'స్మైలీ ఫేస్' గుర్తును సృష్టించిన అమెరికన్ ఆర్టిస్ట్ హార్వే బాల్ 1999లో ప్రారంభించారని,? నవ్వు యొక్క శక్తిని, ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడం, ప్రజలు చిరునవ్వుతో ఉంటూ, ఇతరులు నవ్వడానికి కారణం కావాలని ప్రోత్సహించడం,?"ఒకరిని నవ్వించేందుకు ఒక మంచి పని చేయండి" అనే నినాదంతో ఈ రోజును జరుపుకుంటారని తెలిపారు. ?నవ్వు అనేది భాష, సంస్కృతి, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరికీ అర్థమయ్యే భాష అని,?నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు.? నవ్వినప్పుడు ఎండార్ఫిన్లు, సెరోటోనిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయని, ఇవి నొప్పిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచుతాయని అన్నారు.? ఇతరులతో చిరునవ్వుతో మాట్లాడటం వల్ల సామాజిక బంధాలు బలపడతాయి మరియు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ,?ప్రపంచ చిరున వ్వు దినోత్సవం అనేది జీవితంలో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండడానికి నవ్వు ఎంత ముఖ్యమో గుర్తుచేస్తుందని. కాబట్టి,ప్రతి రోజు హాయిగా నవ్వుతూ, నలుగురిని నవ్విస్తూ సంతోషంగా జీవిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు పిల్లలు పాల్గొన్నారు.

### బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలి

**మద్రాస్ ;** కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్ను కూడా కోర్టు కొట్టివేసింది.

## బయటి షాక్లను తట్టుకోవడంలో భారత్ సామర్థ్యం బలమైనది

ప్రపంచ ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇలాంటి తరుణంలో బయటి నుంచి ఆకస్మికంగా తగిలే షాక్లను తట్టుకోవడంతో భారత్ సామర్థ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఎకనామిక్ కాన్క్లేవ్-2025లో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయని, ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి భారత్కు కూడా దెబ్బేనని, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్కు ఉందని అన్నారు. దేశ ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోందని నిర్మలాసీతారామన్ చెప్పారు.



# బెల్లం టీ తాగితే ఇన్ని లాభాలా ?

బెల్లం, అల్లం కలిపిన టీ ఆరోగ్యానికి మంచిది. బెల్లం టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే.. జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ప్రతిరోజూ ఒకటి లేదా రెండుసార్లు బెల్లం టీ తాగడం వల్ల శరీరంలోని మలినాలు తొలగిపోతాయి. బెల్లం లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడానికి సహాయపడతాయి. వర్షాకాలంలో చలిగా అనిపిస్తే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి బెల్లం టీ తాగవచ్చు. ప్రస్తుతం వర్షాకాలం నడుస్తోంది. వర్షాలు పడటంతో కొత్త నీరు వచ్చి చేరుతుంది. దీంతో పాటుగా ఈగలు, దోమల బెడదతో సీజనల్ వ్యాధులు కూడా విజృంభిస్తుంటాయి. అందుకే వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో చాయ్, కాఫీలు, సూప్‌లు వంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. అయితే, కాఫీ, టీ స్థానంలో బెల్లం టీని ట్రై చేయండి. ఇది రోగనిరోధక శక్తిని పెంచేందుకు సహాయపడుతుంది. బెల్లం టీని తాగడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు శరీరానికి మేలు చేస్తాయి.బెల్లం, అల్లం కలిపిన టీ ఆరోగ్యానికి మంచిది. బెల్లం టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే.. జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ప్రతిరోజూ ఒకటి లేదా రెండుసార్లు బెల్లం టీ తాగడం వల్ల శరీరంలోని మలినాలు తొలగిపోతాయి.

బెల్లం లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడానికి సహాయపడతాయి. వర్షాకాలంలో చలిగా అనిపిస్తే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి బెల్లం టీ తాగవచ్చు. బెల్లం వేడిని ఉత్పత్తి చేస్తుందని, శరీరాన్ని వెచ్చగా ఉంచుతుందని నమ్ముతారు. బెల్లం టీలో కడుపు సమస్యను తగ్గించే శక్తి ఉంటుంది. దీంతో పాటు జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.

# ఖర్జూరాలను ఇలా నానబెట్టి తింటే..

## – బంపర్ బెనిఫిట్స్..!

పాలలో నానబెట్టిన ఖర్జూరాన్ని తినడం వల్ల చర్మ సమస్యలు తొలగిపోతాయి. ముఖం మెరుస్తుంది. పాలలో నానబెట్టిన ఖర్జూరం తినటం వల్ల పొటాషియం అధికంగా లభిస్తుంది. దీని రక్తపోటును నియంత్రించవచ్చు. దీనితో పాటు, పెరిగిన కొలెస్ట్రాల్ నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పోషకాలు అధికంగా ఉండే ఖర్జూరాన్ని పాలతో కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించవచ్చు. ఖర్జూరాలు అనేక పోషకాలను కలిగి ఉన్న డ్రై ఫ్రూట్స్. అవి చూడటానికి చిన్నగా కనిపించినప్పటికీ, వాటిని తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు అంటున్నారు వైద్య ఆరోగ్య నిపుణులు. ఖర్జూరలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ దీ1, దీ 2, దీ3, దీ5 వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే వివిధ రకాల అమైనో ఆమ్లాలతో పాటు సెలీనియం, మాంగనీస్, కాపర్, మెగ్నీషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. ఖర్జూరాలను కొందరు నీళ్లలో నానబెట్టి తింటారు. మరికొందరు పాలలో నానబెట్టి తింటూ ఉంటారు. అయితే, ఎలా తినడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది? నీటికి బదులుగా పాలలో నానబెట్టిన ఖర్జూరాలు తినడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ బి12 మరియు అనేక ఇతర ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఖర్జూరంలో ఫైబర్, విటమిన్లు, సహజ చక్కెర, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే అనేక ఇతర ఖనిజాలు ఉంటాయి. ఖర్జూరాన్ని పాలలో నానబెట్టి తినేటప్పుడు, దాని పోషకాలు పాలలో కలిసిపోతాయి. దాని ప్రయోజనాలు పెరుగుతాయని చెబుతున్నారు. పాలలో నానబెట్టిన ఖర్జూరాన్ని తినడం వల్ల ఎముకలు బలపడతాయి. ఇది పిల్లలు, వృద్ధులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.



పాలలో నానబెట్టిన జీర్ణ ఫైబర్ అధికంగా ఉండే ఖర్జూరాన్ని తినడం వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. దీని వినియోగం మలబద్ధకం, అజీర్ణం, జీర్ణ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఖర్జూరాలలో మంచి మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. పాలలో నానబెట్టి తాగడం వల్ల అలసట, బలహీనత నుండి ఉపశమనం లభిస్తుంది. కేలరీలు, పోషకాలు అధికంగా ఉండే పాలు, ఖర్జూరాలు తీసుకోవడం వల్ల బరువు పెరిగేందుకు దోహదం చేస్తుంది. తక్కువ బరువు ఉండి బరువు పెరగాలనుకునే వారు పాలలో నానబెట్టిన ఖర్జూరాలు తినవచ్చు అంటున్నారు నిపుణులు. పాలు, ఖర్జూరం రెండింటిలోనూ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పాలలో నానబెట్టిన ఖర్జూరాన్ని తినడం వల్ల చర్మ సమస్యలు తొలగిపోతాయి. ముఖం మెరుస్తుంది. పాలలో నానబెట్టిన ఖర్జూరం తినటం వల్ల పొటాషియం అధికంగా లభిస్తుంది. దీని రక్తపోటును నియంత్రించవచ్చు. దీనితో పాటు, పెరిగిన కొలెస్ట్రాల్ నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పోషకాలు అధికంగా ఉండే ఖర్జూరాన్ని పాలతో కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించవచ్చు.

# ఆరోగ్య సిరి ఉసిరి..

## వీళ్లకు మాత్రం వేరీ డేంజర్ గురూ..!



ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఉసిరి తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. సర్జరీ చేయించుకోవాలని అనుకున్న వారు కనీసం 2 వారాల పాటు ఉసిరిని తినకూడదు. మధుమేహం ఉన్నవారు ఉసిరి తినాలనుకుంటే వైద్యులను సంప్రదించిన తర్వాతే తినాలి. టైప్–1, టైప్–2 దయాబెటిస్ ఉన్నవారికి ఉసిరి మంచిదని భావించినప్పటికీ, రక్తంలో చక్కెర తక్కువగా ఉన్నవారికి మంచిది కాదు. ఉసిరి ఎంతో ఆరోగ్యకరమైనది. అయినప్పటికీ కొన్ని సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకోవడం వల్ల ఇబ్బందులు రావొచ్చు. ఎసిడిటీ సమస్యలతో బాధపడుతున్న వారు ఉసిరిని తీసుకుంటే.. మరింత తీవ్రతరమవుతుంది. ఉసిరిలో అధిక మొత్తంలో టానిన్లు ఉంటాయి. ఇవి ప్రేగులపై ప్రభావాన్ని చూపుతాయి. కొన్నిసార్లు మలబద్ధకానికి దారితీస్తాయి. ఉసిరిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ శరీరానికి వివిధ ప్రయోజనాలను అందిస్తాయి. కానీ ఎక్కువగా తీసుకుంటే, అది కడుపు సమస్యలు, విరేచనాలు, డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఉసిరి మూత్రవిసర్జన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది కొన్ని సందర్భాల్లో నిర్జలీకరణ, బరువు తగ్గడానికి కూడా దారితీస్తుంది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఉసిరి తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. సర్జరీ చేయించుకోవాలని అనుకున్న వారు కనీసం 2 వారాల పాటు ఉసిరిని తినకూడదు. మధుమేహం ఉన్నవారు ఉసిరి తినాలనుకుంటే వైద్యులను సంప్రదించిన తర్వాతే తినాలి. టైప్–1, టైప్–2 దయాబెటిస్ ఉన్నవారికి ఉసిరి మంచిదని భావించినప్పటికీ, రక్తంలో చక్కెర తక్కువగా ఉన్నవారికి మంచిది కాదు.

# టమాటా మీరు తింటున్నారా..



టమోటా.. ప్రతి ఇంట్లో ఈ కూరగాయ లేకుండా వంట సాధ్యం కాదు. దీనిని ప్రతి వంటకంలో ఉపయోగిస్తారు. టమాటా వంటకాల రుచిని పెంచుతుంది. అంతే కాదు ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. టమోటా.. ఈ పేరు వినని వారు దాదాపు ఉండరు. టమోటా సోలనేసి కుటుంబానికి చెందిన కూరగాయ మొక్క. ప్రతి భారతీయ ఇంట్లో ఈ కూరగాయ లేకుండా వంట సాధ్యం కాదు. దీనిని ప్రతి వంటకంలో ఉపయోగిస్తారు. టమాటా వంటకాల రుచిని పెంచుతుంది. అంతే కాదు ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. టమోటాలలో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. అంతే కాదు గుండెకు హాని కలిగించే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. టమోటాలలో ఉండే పొటాషియం కంటెంట్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. టమోటాలలో విటమిన్ ఎ తో పాటు లుటిన్, బీటా–కెరోటిన్, జియాక్సంతిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి కంటి చూపును మెరుగుపరుస్తాయి. వయస్సు సంబంధిత మాక్యులర్ క్షీణత నుంచి రక్షించడంలో సహాయపడతాయి. డిజిటల్ పరికరాలు విడుదల చేసే నీలి కాంతి నుంచి కళ్ళను రక్షించడంలో కూడా ఇవి సహాయపడతాయి. టమోటాలలో లభించే లైకోపీన్ క్యాన్సర్ నివారణకు కూడా సహాయపడుతుంది. ఇది క్యాన్సర్ కణాల పెరుగుదలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్రోస్టేట్, ఊపిరితిత్తులు, కడుపు, కొలొరెక్టల్ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తుందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. టమోటాలలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీనితోపాటు వీటిల్లోని లైకోపీన్ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ రెండు అంశాలు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఫలితంగా ఆరోగ్యకరమైన చర్మం మీసొంతం అవుతుంది. అంతే కాదు, సూర్యకాంతి వల్ల కలిగే నష్టం నుంచి చర్మాన్ని రక్షించడంలో, చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయి. టమోటాలలో విటమిన్ సి తో పాటు యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. టమోటాలలో విటమిన్ కె, కాల్షియం ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి, శరీరానికి తక్షణ శక్తిని అందించడానికి సహాయపడతాయి. ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అంతే కాదు టమోటాలలో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఫలితంగా ఇది అతిగా తినడం ధోరణిని తగ్గిస్తుంది.

# ఉదయాన్నే ఖాళీకడుపుతో మునగాకు నీరు తాగితే..!



తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దయాబెటిస్ ను నియంత్రిస్తుందిఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది, దయాబెటిక్ రోగులకు మరియు ప్రీ దయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్విషీకరణ, ఎనర్జీ బూస్ట్నేచురల్ డిటాక్సిఫైయింగ్ గుణాలు కాలేయం, మూత్రపిండాల పనితీరుకు సహాయపడతాయి. శరీరాన్ని నిర్విషీకరణ చేస్తాయి. శక్తి స్థాయిలను పెంచుతాయి.మునగాకు దాని సూక్ష్మపోషకాల కారణంగా ఆహారంగా, ఔషధంగా రెండు రకాలుగా పురాతన కాలం నుండి వినియోగంలో ఉంటూ వస్తోంది. పరగడుపున తీసుకుంటే శరీరంలోని వివిధ వ్యాధులు, పోషక లోపాలను తొలగించడానికి మునగాకు నీరు ఉపయోగపడుతుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.మునగాకులో అవసరమైన విటమిన్లు (ఎ, సి, ఇ), ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, ఇనుము) యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. నొప్పి నివారణదీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి. ఇది ఎముక సాంద్రత మరియు బోలు ఎముకల వ్యాధి నివారణకు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. మెటబాలిజం బూస్ట్, బరువు తగ్గడంమునగాకు నీరు జీవక్రియను మెరుగుపరుస్తుంది. తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దయాబెటిస్ ను నియంత్రిస్తుందిఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది, దయాబెటిక్ రోగులకు మరియు ప్రీ దయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్విషీకరణ, ఎనర్జీ బూస్ట్నేచురల్ డిటాక్సిఫైయింగ్ గుణాలు కాలేయం, మూత్రపిండాల పనితీరుకు సహాయపడతాయి. శరీరాన్ని నిర్విషీకరణ చేస్తాయి. శక్తి స్థాయిలను పెంచుతాయి. చర్మ ఆరోగ్యం, రక్తహీనత చికిత్సవిటమిన్ ఇ, ఇనుము సమృద్ధిగా ఉన్న మునగాకు ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తుంది. మొటిమలను తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఐరన్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా రక్తహీనత చికిత్సకు సహాయపడుతుంది.

# చక్కగా కొవ్వును కరిగించే చెక్క..!



అంతేకాకుండా, దాల్చిన చెక్క నీటితో ఇపీరియడ్స్ పెయిన్ సమస్యను దూరం చేసుకోవడానికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. ఇది చర్మానికి మెరుపును తెస్తుంది. జుట్టు మూలాలను బలపరుస్తుంది. దాల్చిన చెక్క నీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని డీటాక్స్ చేసి మొటిమల నుంచి రక్షిస్తాయి. దాల్చిన చెక్కను తింటుంటే కేశాలు పొడవుగానూ, మందంగానూ పెరుగుతాయి. మన భారతీయ మసాలా రుచులను సుసంపన్నం చేస్తున్న సుగంధ ద్రవ్యం దాల్చిన చెక్క. ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ దాల్చిన చెక్కను వాడుతున్నారు. దాల్చిన చెక్కలోని ఔషధ గుణాలు అనేక రోగాలకు చెక్ పెడుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా టైప్ 2 దయాబెటిస్ వ్యాధిగ్రస్థులకు బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచే గొప్ప గుణం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మధుమేహం నియంత్రణలో దాల్చిన చెక్క ఉపయోగం అంతాఇంతాకాదు. దాల్చిన చెక్కలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ కె, యాంటీ బాక్టీరియల్–యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు సమృద్ధిగా ఉన్నాయి. దాల్చన చెక్కతో తయారు చేసిన నీటిని తీసుకోవటం వల్ల ఈ లాభాలు రెట్టింపు అవుతాయని నిపుణులు చెబుతున్నారు. దాల్చిన చెక్క నీటిలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ నీటిని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. దాల్చిన చెక్కలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు పేగులను ఆరోగ్యంగా ఉంచుతాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీని వినియోగం కడుపులో గ్యాస్, అజీర్ణం, ఉబ్బరం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. దాల్చిన చెక్క నీటిలో ఉండే పాలీఫెనాల్స్, ఇతర యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దీని వినియోగం జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. దాల్చిన చెక్కలో థర్మోజెనిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీర వేడిని పెంచడం ద్వారా కొవ్వును కాల్చడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. దాల్చిన చెక్క నీరు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రిస్తుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది. అంతేకాకుండా, దాల్చిన చెక్క నీటితో ఇపీరియడ్స్ పెయిన్ సమస్యను దూరం చేసుకోవడానికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. ఇది చర్మానికి మెరుపును తెస్తుంది. జుట్టు మూలాలను బలపరుస్తుంది. దాల్చిన చెక్క నీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని డీటాక్స్ చేసి మొటిమల నుంచి రక్షిస్తాయి.



## భగత్ సింగ్ రేట్లకు రెక్కలు..

పవన్ కళ్యాణ్ ఓజితో సూపర్ బ్లాక్ బస్టర్ కొట్టేశారు. ఫైనల్ స్టేటస్ తేలడానికి టైం పడుతుంది కానీ హరిహర వీరమల్లు చేసిన గాయమైతే మానిపోయింది. ఎన్నడూ లేనిది పవన్ తాను ఒక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిననే సంగతి మర్చిపోయి మరీ సక్సెస్ సెలబ్రేషన్స్ లో పాలు పంచుకున్నారు. సినిమాల పరంగా ఆయన ఇంత ఆనందంగా ఉండటం ఈ మధ్యకాలంలో చూడలేదని సన్నిహితులు అంటున్నారు. ఒకవేళ ఓజి కనక ఫ్లాప్ అయ్యుంటే ఇక మేకప్ కి దూరంగా ఉండేవారేమో కానీ ఇప్పుడు మాత్రం మళ్ళీ నటించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని వాళ్ళ మాట. ఇక నెక్స్ట్ అందరి చూపు ఉస్తాద్ మీద వెళ్తోంది. ఇన్ సైడ్ టాక్ ప్రకారం ఓజి పుణ్యమాని ఉస్తాద్ భగత్ సింగ్ కోసం అప్పుడే బిజినెస్ ఎంక్వయిరీలు మొదలయ్యాయట. ఇంకా విడుదల కన్ఫర్మ్ చేయకపోయినా అడ్వాన్సులు ఇచ్చేందుకు డిస్ట్రిబ్యూటర్లు రెడీగా ఉన్నారు. అయితే మైత్రి మూవీ మేకర్స్ ఇప్పుడప్పుడే తొందరపడే ఉద్దేశంలో లేరు. ఎందుకంటే ఈ సినిమాకు సంబంధించిన ప్రాపర్ ప్రమోషన్లు ఇంకా మొదలుపెట్టలేదు. దర్శకుడు హరీష్ శంకర్ పవన్ పార్ట్ పూర్తి చేసినప్పటికీ మిగిలిన ప్యాచ్ వర్కులతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వేగవంతం చేయాలి. డిసెంబర్ లోగా ఫస్ట్ కాపీ సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయని సమాచారం. ఓజి రూపంలో పవన్ స్టామినా ఏంటో బయట పడింది కాబట్టి అది ఉస్తాద్ భగత్ సింగ్ కు ఖచ్చితంగా ఉపయోపడుతుంది. కాకపోతే ఓజి స్థాయిలో దీని మీద బజ్ లేదు. దాన్ని కొత్తగా క్రియేట్ చేయాలి. తేరి రీమేకనే ప్రచారంలో మొదట్లో ఏదైతే జరిగిందో దాన్ని పూర్తిగా మర్చిపోయేలా పబ్లిసిటీ జరగాలి. దానికి హరీష్ శంకర్ దగ్గర ఒక ప్లాన్ ఉందట.



## లోకా ఇంకా ఆడుతోందేమిటయ్యా

అఖిల్ హలోతో టాలీవుడ్ కు పరిచయమైన కళ్యాణి ప్రియదర్శన్ టైటిల్ రోల్ పోషించిన లోకా చాప్టర్ 1 విడుదలైన అయిదు వారాలవుతున్నా బాక్సాఫీస్ దగ్గర దూకుడు కొనసాగిస్తునే ఉంది. ఇప్పటికీ గంటకు బుక్ మై షోలో 1300కు పైగా టికెట్లు అమ్ముడుపోవడం మాములు విషయం కాదు. దీనికి పోటీగా వచ్చిన మోహన్ లాల్ హృదయపూర్వం అప్పుడే ఓటిటిలో వచ్చేయగా లోకా మాత్రం ఇప్పట్లో డిజిటల్ రిలీజయ్యే సమస్యే లేదంటోంది. పాత రెకార్డులన్నీ బద్దలు కొట్టిన లోకా చాప్టర్ 1 అతి త్వరలో 300 కోట్ల క్లబ్బులో అడుగు పెట్టనుంది. ఇది జరిగితే సరికొత్త చరిత్ర లిఖితమవుతుంది. వీకెండ్ లోపు అయిపోవచ్చు.ఇదిలా ఉండగా లోకా ఖాతాలో మరో మైలురాయి చేరుకుంది. కేరళలో అత్యధిక ఫుట్ ఫాల్స్ (థియేటర్ కు వచ్చిన జనాల సంఖ్య) రాబట్టిన సినిమాగా కొత్త రికార్డు ఖాతాలో వేసుకుంది.

1 కోటి 18 లక్షలకు పైగా ఫుట్ ఫాల్స్ లోకా పేరు మీద నమోదయ్యాయి. దీని తర్వాతి స్థానాల్లో మంజుమ్మల్ బాయ్స్, పులి మురుగన్, తుడరమ్ ఉన్నాయి. ఎంపురాన్ కంటే ఇవి పెద్ద నెంబర్స్ కావడం గమనార్హం. నిర్మాత దుల్కర్ సల్మాన్ కు ఊహించని విధంగా లాభాల వర్షం కురిపించిన లోకా ఈజీగా యాభై రోజులు పూర్తి చేసుకోనుంది. ఈ సిరీస్ లో రెండో భాగం టోవినో థామస్ హీరోగా ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. విచిత్రం ఏమిటంటే లోకాకి ఇతర భాషల్లో భారీ స్పందన దక్కలేదు. తెలుగులో మొదటి రెండు మూడు రోజులు హడావిడి చేసి కాసిన్ని వసూళ్లు రాబట్టింది కానీ తర్వాత హఠాత్తుగా చల్లబడిపోయింది. కారణం కంటెంట్ మనకు పూర్తిగా కనెక్ట్ కాలేకపోవడమే. సితార డిస్ట్రిబ్యూషన్ వల్ల మంచి రిలీజ్ దక్కించుకుంది కానీ దాన్ని నిలబెట్టుకోలేకపోయింది.



## నేహా శెట్టి పాట ప్లస్సయ్యిందా!

ఎడిటింగ్ లో తీసేసిన ఓజి ఐటెం సాంగ్ ని ఇటీవలే జోడించిన సంగతి తెలిసిందే. నేహా శెట్టి మీద బ్యాంకాక్ లో షూట్ చేసిన ఈ ప్రత్యేక గీతం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ప్రీ క్లైమాక్స్ కు ముందు పవన్ కళ్యాణ్ గాయపడితే ఇమ్రాన్ హాష్మీ వచ్చే టైంలో దర్శకుడు సుజిత్ దీనికి ప్లేస్ మెంట్ ఇచ్చాడు. అయితే సీరియస్ గా జరుగుతున్న నెరేషన్ లో ఇది అడ్డం వస్తుందని భావించి ఫస్ట్ వెర్షన్ లో తీసేశారు. డీజే టిల్లు భామ ఆడిపాడినా ఎందుకు ఇంపాక్ట్ లేదంటే అందులో పవన్ కళ్యాణ్ డాన్స్ చేయడం లాంటివేవీ లేవు కాబట్టి. తమన్ కూడా మిగిలిన సాంగ్స్ రేంజ్ లో దీన్ని కంపోజ్ చేయలేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏతావాతా చెప్పేదేంటంటే నేహా శెట్టి పాట వల్ల కలిగిన ప్రయోజనం పెద్దగా లేదు. అందుకే తను కూడా ఒకచోట తప్ప ఎక్కడా ఓజి గురించి చెప్పడం కానీ, పవన్ కళ్యాణ్ తో స్క్రీన్ పంచుకున్నందుకు ఎగ్ జైట్మెంట్ చూపించడం కానీ ఏమి చేయలేదు. ఒకే ఫ్రేమ్ లో ఇద్దరు లేనప్పుడు తను మాత్రం ఏం చేస్తుంది. ఒక్కటి మాత్రం వాస్తవం. ఫ్లోకు అడ్డం వస్తాయని తీసేసిన పాటల వల్ల అమాంతం కలెక్షన్లు పెరగడం లాంటివి ఉండవు. దేవర, మిరాయ్ ఎంత పెద్ద హిట్టయినా తర్వాత యాడ్ చేసిన సాంగ్స్ వల్ల ఎక్కువ బెనిఫిట్ పొందలేకపోయాయి. ఒరిజినల్ గా లాక్ చేసిన వర్షన్లే బాగున్నాయని ఆడియన్స్ అనుకునేలా చేశాయి. సుహాస్ సీన్ తీసేయడం, అర్జున్ దాస్ ఫ్లాష్ బ్యాక్ అయ్యాక కాస్త ట్రిమ్ చేయడం లాంటివి కూడా కొంచెం మైనస్ అయ్యాయని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. సరే ఏదైతేనేం నేహా శెట్టిది బోనస్ గా ఫీలవ్వడం తప్ప ఎవరైనా చేయగలిగింది ఏమి లేదు. కాకపోతే మొదటిసారి ఓజి చూస్తున్న వాళ్లకు మాత్రం ఇదో స్పీడ్ బ్రేకర్ లా అనిపించడమే సమస్య.


## ‘కె-ర్యాంప్’ థర్డ్ సింగిల్ అప్డేట్..



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరుస సిపిమాలతో ఫుల్ జోష్‌లో ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. విభిన్న కథలు ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవల ‘క’ చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యుక్తి తరేజ (%బనిస్త్రఞ ఖుతీవయిఖ%)హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను హాస్య మూవీస్, రుద్రాన్ని బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో నరేష్ కీలక పాత్రలో కనిపించడగా.. ‘కె-ర్యాంప్’కు చైతన్య భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా అక్టోబర్ 31న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్రబృందం వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా, ‘కె-ర్యాంప్’ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసి ఫుల్ జోష్‌తో ఉన్న చిత్రబృందం.. ఈ సినిమాకు సంబంధించిన థర్డ్ సింగిల్ రాబోతున్నట్లు అధికారక ప్రకటన విడుదల చేశారు. తిక్కల్.. తిక్కల్ అని సాగే ఈ పాట సెప్టెంబర్ 4న రాబోతున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్‌ను షేర్ చేశారు. ఇక ఇందులో కిరణ్ అబ్బవరం ఓ చర్చిలో వైట్ కలర్ షర్ట్ ధరించి మెడలో గులాబి పూల మాల.. నొట్లో బంతిపువ్వు పెట్టుకుని షాక్ అవుతూ కనిపించాడు. ఆయన చుట్టూ కొందరు బ్యాండ్ వాయిస్తూ కనిపించగా.. హీరోయిన్ సెల్ఫీ తీసుకుంటుండగా.. నటి సీతూ నవ్వుతూ కనిపించింది. ప్రస్తుతం ఈ క్రేజీ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరాయాసిటీని పెంచుతోంది.

## తట్టుకుని నిలబడుతున్న ఓజి

ఒకపక్క కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ పాజిటివ్ టాక్ వెల్లువలా సోషల్ మీడియాని ముంచెత్తుతున్నప్పటికీ ఓజి మేనియా దాన్ని తట్టుకుని నిలబడుతోంది. దసరా పండగని క్యాష్ చేసుకునే పనిలో ఉన్న ఓజస్ గంభీర ఇప్పటిదాకా సుమారు రెండు వందల అరవై కోట్ల గ్రాస్ దాటేసి ట్రిపుల్ సెంచరీ వైపు పరుగులు పెడుతున్నాడు. 2025 హయ్యస్ట్ గ్రాసర్ గా ఉన్న సంక్రాంతికి వస్తున్నాంని అఫీషియల్ గా దాటేందుకు పరుగులు పెడుతున్నాడు. బుక్ మై షోలో గంటకు ఇప్పటికీ పది వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం చూస్తుంటే పవన్ సునామి బాగానే వెళ్తోందని అర్థమవుతోంది. ముఖ్యంగా నైజాం వసూళ్లు భారీగా ఉన్నాయి.ఏపీలో పది రోజుల పాటు పెంచిన టికెట్ ధరలే కొనసాగించాలని డిస్ట్రిబ్యూటర్లు నిర్ణయించుకోవడంతో దాని ప్రభావం ఆక్యుపెన్సీల మీద పడుతోంది. మెయిన్ సెంటర్స్ లో పవన్ క్రేజ్ పుణ్యమాని చెల్లిపోతోంది కానీ బిసి కేంద్రాల్లో హౌస్ ఫుల్స్ ఆలస్యంగా జరుగుతున్నాయి లేదా మొత్తం సోల్డ్ అవుట్ చేయలేకపోతున్నాయి. ఒకవేళ తెలంగాణ తరహాలో ప్రభుత్వం అనుమతించిన రెగ్యులర్ గరిష్ట ధరలే అమలులో ఉంటే ఓజి రన్ ఇంకా బలంగా ఉండేదని ట్రేడ్ టాక్. అయితే పెట్టుబడి కోణంలో చూసుకుంటే వేగంగా రికవర్ కావాలంటే పండగ టైంలో పెంపులు ఉంచేయక తప్పదు. అందుకే దాన్ని కంటిన్యు చేస్తున్నారు. వచ్చే వారం కూడా చెప్పుకోదగ్గ రిలీజులు లేవు కాబట్టి ఓజి అంత సులభంగా డ్రాప్ అవ్వకపోవచ్చు. ఒకసారైనా చూడొచ్చనే అభిప్రాయం కామన్ ఆడియన్స్ లో రావడంతో ఫుట్ ఫాల్స్ పెరుగుతున్నాయి. అయితే కాంతార చాప్టర్ 1 ప్రభావం లేదని కొట్టి పారేయడానికి లేదు. ఎందుకంటే ఫ్యామిలీ జనాలకు దీని రూపంలో ఇంకో ఛాయస్ దొరికింది.



## రిషబ్ శెట్టి ఎమోషనల్ ట్వీట్



కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి స్వయం దర్శకత్వంలో తెరకెక్కిన ‘కాంతార:చాప్టర్1’ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అక్టోబర్ 2న దసరా కానుకగా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించడంతో పాటు బాక్సాఫీసు వద్ద హిట్ టాక్‌తో దూసుకుపోతుంది. అలాగే కలెక్షన్లు సైతం బాగానే రాబడుతోంది. అన్ని భాషల్లో సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. థియేటర్స్ వద్ద హౌస్ ఫుల్ బోర్డులు సైతం పెడుతున్నారు. తాజాగా, ఈ విషయంపై రిషబ్ శెట్టి స్పందిస్తూ ఎమోషనల్ అయ్యారు. “2016లో నేను దర్శకత్వం వహించిన సినిమా సాయంకాలం షో ప్రదర్శించడం కోసం పడిన కష్టం నుంచి 2025లో 5000లకు పైగా థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించే వరకూ ఇది నా జర్నీ. ఈ సినిమా ప్రయాణం దేదువి దయతో పాటు మీ ప్రేమాభిమానాలను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. మీ ఆదరణతోనే ఈ విషయం సాధ్యమైంది. నన్ను ఆదరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరూనా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను” అని రాసుకొచ్చారు. దీంతో అది చూసిన అభిమానులు ఎప్పటికీ మా సపోర్ట్ ఉంటుందన్నా.. బాధపడకండి అని కామెంట్లు చేస్తున్నారు. కాగా.. ఈసినిమా సూపర్ హిట్ ‘కాంతార’కు సీక్వెల్‌గా వచ్చింది. ఇందులో రిషబ్ శెట్టి సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రాన్ని హొంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కించగా.. మంచి రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంటోంది.

## స్క్రిప్ట్ వినకుండానే సినిమా ఒప్పుకున్నా..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న భారీ బడ్జెట్ మూవీ ‘ఉస్తాద్ భగత్‌సింగ్’. ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా..రాశి ఖన్నా ఫొటోగ్రాఫర్ పాత్రలో కనిపించనుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతుండగా.. ఇటీవల రాశిఖన్నా పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తి అయినట్లు ప్రకటించింది. ఈ సినిమా ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశిఖన్నా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. “ఉస్తాద్ భగత్‌సింగ్ కోసం హరీష్ శంకర్ నాకు కాల్ చేసినప్పుడు నేను కథ వినకుండానే ఒకే చేశాను. పవన్ కళ్యాణ్ నటిస్తున్నారని చెప్పడంతో.. స్క్రిప్ట్ కూడా వద్దు అని చెప్పాను. ఉస్తాద్ భగత్‌సింగ్ కేవలం పవన్ కళ్యాణి గారి కోసమే చేశాను. చాలామందికి ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఆయనతో సినిమా చేయాలనే డ్రీమ్ ఉంటుంది. నాకు కూడా అలాగే ఏండేది. నేను ఈ మూవీ చేయడంతో నా డ్రీమ్ ఫుల్ ఫిల్ అయింది. నేను పవన్ కళ్యాణ్ గారి గురించి చాలా విన్నాను. ఆయన స్వాగ్ అనుకోకుండా ఉంది. నిజంగా పవన్ గారితో పని చేయటం అదృష్టంగా భావిస్తున్నాను. నాకు ఆయనంటే చాలా ఇష్టం.. విపరీతమైన నాలెడ్జ్ కలిగి ఉన్నారు. ఆడియన్స్ అంటూ చాలా ఇష్టం. కొంతమందికి సినిమాలు అంటే పిచ్చి ఉంటుంది.. కానీ పవన్ కళ్యాణి గారికి జనాలు అంటే పిచ్చి” అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# భక్తి మార్గంలో నడిచే ప్రతి ఒక్కరికీ భగవంతుని దీవెనలుంటాయి

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- శ్రీ షిరిడీ సాయిబాబా సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో విప్ ఆది "శమీ పూజ"**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడలో శ్రీ షిరిడీ సాయిబాబా సేవా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో శమీ (జమ్మి) పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వానితులుగా గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ "విజయదశమి సందర్భంగా చేసే శమీ పూజకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. భక్తి మార్గంలో నడిచే ప్రతి ఒక్కరికి సాయి ఆశీస్సులు లభిస్తాయి. సమాజంలో ఐక్యత,శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని మనందరం ప్రార్థించాలి"అని అన్నారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షులు వారాల దేవయ్య, ఉపాధ్యక్షులు కోనమ్మగారి నాగరాజు, కార్యదర్శి గంప రాజేందర్, కోశాధికారి కూర రమేష్, ఏంబేరి నర్సయ్య, పీచర్ రవీందర్ రావు, తొగరి వెంకటేశం, సాయి సంస్థాన్ దాతలు, భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.అనంతరం వారాల దేవయ్య మాట్లాడుతూ అందరికీ శ్రీ సాయి శుభాశీస్సులు, అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించి,ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కొదురుపాకలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు

**- మై భారత్ వాలంటరీ : గంగిపల్లి స్వామి కుమార్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలం, కొదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మై భారత్, కొదురుపాక స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో "బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు" నిర్వహించబడుతున్నాయని, ఈ టోర్నమెంట్ అక్టోబర్ 5వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరగనుందని, టోర్నమెంట్‌లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, చెస్ వంటి విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన క్రీడాకారులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా మై భారత్ వాలంటరీ గంగిపల్లి స్వామి కుమార్ తెలిపారు .రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం ఆర్గనైజర్స్‌ను సంప్రదించవచ్చని స్వామి కుమార్ తెలిపారు.రాజు - 6305692631,వెంకటేష్ - 8465970421,అభిరామ్ - 8978300549.

# ఆడపిల్లల విద్య - భవిష్యత్తు కు అండగా నిలుస్తున్న తూడి లచ్చన్న " బంగారుతల్లి పథకం"

**- చిన్నారుల భవిష్యత్తు ను సురక్షితం చేయడం సమాజం కర్తవ్యం**

**- ప్రముఖ సామాజిక వేత్త : తూడి లచ్చన్న**

**- లచ్చన్న సేవా దాతృత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు - చిన్నారుల తల్లిదండ్రులు**

**- 14 మంది చిన్నారులకు రూ.5016 చొప్పున ప్రొసీడింగ్ కాపీలు అందజేత**



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, గంగాధర మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త,టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న ఆధ్వర్యంలో ఆడపిల్లల సంక్షేమానికి వినూత్న కార్యక్రమం కొనసాగుతోంది.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సుకన్య సమృద్ధి యోజన" (ఎస్.ఎస్.వై.) లో భాగంగా, 2023 మార్చి 3 నుండి గ్రామంలో జన్మించిన ప్రతి ఆడపిల్లకు తూడి లచ్చన్న స్వయంగా రూ.5,016 చెల్లించి పోస్ట్ ఆఫీసులో ఖాతాలు తెరిపించి,ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్‌లను చిన్నారుల తల్లిదండ్రులకు అందజేస్తూ,"బంగారుతల్లి పథకం" కి శ్రీకారం చుట్టారు.బంగారుతల్లి పథకంలో భాగంగా దసరా పండుగ సందర్భంగా గురువారం మల్లాపూర్ గ్రామంలో మరో 14 మంది చిన్నారుల తల్లిదండ్రులకు తూడి లచ్చన్న ఒక్కొక్కరికి రూ.5,016 చొప్పున ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ "ఆడపిల్లల పుట్టుకను ఆనందంగా జరుపుకోవడం మనందరి బాధ్యత. వారి భవిష్యత్తు బలపడేలా చేయడం సమాజ కర్తవ్యం. ఈ బంగారుతల్లి పథకం ద్వారా ప్రతి ఆడపిల్ల చదువుకు, పెరుగుదలకు తోడ్పాటును అందించాలనేది నా ఆశయం. ఆడపిల్లల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు.అలాగే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ "మా కుమార్తెల కోసం తూడి లచ్చన్న చూపుతున్న సేవా దాతృత్వం మాకు ఎంతో ఆత్మస్థైర్యం కలిగిస్తోంది. పేదల ఇళ్లలో పుట్టిన ఆడపిల్లల భవిష్యత్తుకు వెలుగులు నింపాలని ఆయన చేస్తున్న ప్రయత్నం నిజంగా అభినందనీయం. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని కోరుకుంటున్నాం" అంటూ లచ్చన్న కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎల్ యువసేన సభ్యులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కౌటల సిఐ సంతోష్ కుమార్ కి అంబేద్కర్ మెమెంటోతో బహుకరించిన సూరన్న




కౌటల (ప్రశ్న న్యూస్)సామాన్య పౌరులకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం ఏర్పడాలి, నిజాయితీ పరులకు న్యాయం జరగాలి, ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి పోలీస్ స్టేషన్ కు వచ్చే వాతావరణం ఏర్పాటు చేయాలని, కబ్జాకోరులకు అండగా ఉండకూడదు అనే విషయాలపై సిఐ సంతోష్ కుమార్ తో చర్చించారు.ఏ వ్యవస్థ ముందుకు నడవలన్న భారత రాజ్యాంగమే ప్రామాణికం.రాజ్యాంగం రచించడానికి కృషి చేసిన బాబాసాహెబ్ ని ప్రతి భారతీయ పౌరుడు అనుసరించాల్సిందే అన్నారు.కాబట్టి అందరిలాగ శాలువాతో సన్మానించకుండా అంబేద్కర్ మెమంటోను బహుకరించారు.ఈ కార్యక్రమంలో సూరన్నతో పాటు సామాజిక ఉద్యమకారులు వంశీజాడే పాల్గొన్నారు.

# గవర్నర్ ను ఒప్పించి రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు : పాలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్-ఉత్తర తెలంగాణ: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వ ప్రతి నిర్ణయానికి రాష్ట్ర అఖిలపక్షం ఆమోదం తెలిపిందని, ముఖ్యంగా ప్రత్యేక జీవో 9 ద్వారా షెడ్యూల్ విడుదల అయినప్పటికీ, కోర్టు విచారణ కొనసాగుతుండటంతో పార్టీ నేతలు రకరకాల ప్రకటనలు చేస్తున్నారని బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 8న హైకోర్టు విచారణకు ముందు, గవర్నర్ ను ఒప్పించి, చట్టబద్ధంగా, శాస్త్రీయంగా రిజర్వేషన్లు అమలు చేయించాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ నేతల సమావేశంలో స్థానిక ఎన్నికల ప్రణాళికలు

**- హైదరాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతల కీలక సమావేశం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది.సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం,మాజీ మంత్రి జీవన్ రెడ్డి,కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, హుజూరాబాద్ ఇంచార్జి ఒడితల ప్రణవ్ సహా ఇతర ప్రధాన నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, విజయానికి తీసుకోవాల్సిన చర్యలు, నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగినట్లు నేతలు వెల్లడించారు.

# వైభవోపేతంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో దసరా ఉత్సవాలను ఉద్వాసంగా జరుపుకుంటూ దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను స్థానికులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకలో గ్రామంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న దుర్గా కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు, దుర్గమ్మ కొలుపు, కుంకుమ పూజలు, అన్నదానాలు, అభిషేకాలు, మాలలు ధరించి భక్తులు ఘనంగా భవానిని పూజించారు.తడగొండలో శ్రీ దుర్గా గణేష్ కమిటీ ప్రతీ సంవత్సరం దసరా తరువాత దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది. ఆనవాయితీ ప్రకారం శుక్రవారం ఈ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు, గ్రామవాసులలో ఉత్సాహాన్ని మరింత పెంపొందిస్తూ ఉత్సవ వాతావరణాన్ని సృష్టించాయి.

# సమాజ ఐక్యతకు "అలయ్ - బలయ్" గొప్ప వేదిక

**- మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ చైర్మన్ : జి. రాజేశం గౌడ్**





వేములవాడ / కరీంనగర్ ( ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన "ఆలయ్ - బలయ్" కార్యక్రమంలో జన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తో కలిసి మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ చైర్మన్ జి. రాజేశం గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆలయ్ - బలయ్ అనేది బతుకమ్మ పండుగ ఆత్మను ప్రతిబింబించే అపూర్వమైన సాంప్రదాయం. ఇక్కడ అన్నదమ్ములా, అక్కాచెల్లెమ్మలా, కులమత భేదాలు లేకుండా అందరం కలసి పండగను జరుపుకోవడం మన తెలంగాణ సంస్కృతిలో ఉన్న విశిష్టత. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో ఐక్యతా భావం, సోదరభావం మరింత బలపడుతుంది. యువత ఈ సంప్రదాయాలను తెలుసుకొని ముందుకు తీసుకెళ్తే, భవిష్యత్ తరాలకు కూడా మన సంస్కృతి సజీవంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే తెలంగాణ అభివృద్ధి: హనుమంతరావు

**దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**



అంబర్ పేట(ప్రశ్న న్యూస్) దసరా పండుగ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు ను కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్ యాదవ్, నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, జహంగీర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా పండుగ అందరి కుటుంబాలలో సంతోషాన్ని నిలపాలని ఆకాంక్షించారు. విజయానికి ప్రతిక విజయదశమి అని పేర్కొన్నారు.దసరా పండుగ హిందువుల ముఖ్యమైన పండుగ అని తెలిపారు.

# ఎన్నికల నియమాలకు అనుగుణంగా మెలగాలి..!!

**- జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మి..**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 03: రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా కార్లలో బస్సులో, ఇతర వాహనాల్లో ప్రయాణించే ప్రతి వ్యక్తి దగ్గర రూ.50వేల నగదుకు మించి ఉండరాదని, అలా కాకుండా 50 వేలకు పైబడి నగదు ఉన్నట్లయితే సంబంధిత పత్రాలు చూపించి నగదు తీసుకువెళ్లవలసి ఉంటుందని జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మి ఓ ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలూరుపాడు సర్కిల్ పరిధిలోని మండలాలలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల నియమాలకు అనుగుణంగా ప్రజలు మెలగాలని, అక్రమంగా మద్యం తరలించే వారి పట్ల సమాచారం అందించాలని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు వచ్చి ప్రజలను నమ్మించే విధంగా మోసపూరిత కార్యక్రమాలు చేపట్టే వారి పట్ల కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, అలాంటి వారి ఎవరైనా గ్రామాలలో తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ కి లోబడి వ్యవహరించాలని సీఐ సూచించారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-మహేష్ కుమార్ గౌడ్**

**దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్ ను పిసిసి ప్రధాన కార్యదర్శలు నాగభూషణం,కొమరయ్య ,కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బడుగు, బలహీన వర్గాలకు అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వల్ల ఆర్థికంగా, రాజకీయంగా రాణిస్తారన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి..!!

**- మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి.**

**- బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు.**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 03 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని. ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను నట్టేట ముంచిందని. కాంగ్రెస్, అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, మహిళలను, నిరుద్యోగులను, సబ్బండ వర్గాలను మోసం చేసిందని. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐకమత్యంగా పని చేసి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. ప్రజలకు రేవంత్ చేస్తున్న మోసాలను అమలుగాని హామీలను ఇచ్చి మోసగించిన విధానాన్ని అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. ప్రజలు కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని రాబోయే రోజుల్లో కెసిఆర్ పాలన రావాలంటే స్థానిక ఎన్నికలే అందుకు పునాదులు వేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని ఎన్నికలు ఏవైనా బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు

## – ఏ పార్టీని నిలబెడతాయి.. ఎవరిని ముంచేస్తాయి.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)

తెలంగాణలో స్థానిక ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలు తెరవెనుక కసరత్తులు వేగవంతం చేశాయి. పదునైన వ్యూహాలతో స్థానిక ఎన్నికల బరిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. అయితే ఈసారి ఎన్నికలు కాస్త వైవిధ్యంగా కనిపిస్తున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ప్రజాక్షేత్రంలోకి అధికార కాంగ్రెస్ అడుగుపెడుతోంది. మీరెంతో మీకంత అంటూ బిసిలను ఐక్యం చేసి, గంపగుత్తగా ఓట్లు సాధించే ప్రయత్నాలు గట్టిగానే చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం, తరువాత గవర్నర్ గ్రీన్ సిగ్నల్, అక్కడి నుండి రాష్ట్రపతి వద్ద వెయిటింగ్ వరకూ కాంగ్రెస్ పాచిక చేరింది. ఇప్పుడు బంతి రాష్ట్రపతి కోర్టులో ఉంది. ఇలా మ్మాదేం తప్పులేదు, మేము బిసిలకు చేయాల్సిందంతా చేస్తున్నాం, అడ్డుపడుతున్నది బిజేపినే అంటూ బిసిలకు బిజేపిని దూరం చేసే ప్రయత్నం చేస్తోందనేది పొలిటికల్ టాక్. అంతేకాదు బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ఆధారంగా స్ధానిక ఎన్నిక్లలో సీట్లు కేటాయిస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 31 జిల్లాల్లో , 565 మండలాల్లో స్ధానిక ఎన్నికలు జరగబోతున్నాయి. కొత్త రిజర్వేషన్ల కేటాయింపు తరువాత ఏ కులాలకు తాజాగా సీటు కేటాయింపులు ఎలా ఉన్నాయంటే..

### ఏ సామాజిక వర్గాలకు ఎంత శాతం..

ప్రధానంగా జెడ్పీ చైర్ పర్సన్ త్జాజా లెక్కలు పరిశీలిస్తే బీసీలకు 41.93శాతం , ఎస్సీలకు 19.35, ఎస్టీలకు 12.90, ఓసీలకు 25.80 శాతం సీట్లు కాటాయించింది. జిల్లాల వారీగా రిజర్వేషన్లు చూస్తే ఖమ్మ జిల్లా జడ్పీ చైర్మెన్ ఎస్టీ అభ్యర్ధికి, ములుగు జడ్జీ చైర్మెన్ ఎస్టీ మహిళకు కేటాయించారు. నల్గొండ జడ్పీ చైర్ పర్సన్ ఎస్టీ మహిళకు, వరంగల్ ఎస్టీ, హన్మకొండ , జనగామ జడ్పీలు ఎస్సీ మహిళకు కేటాయించారు. జోగులాంబ గద్వాల్ , రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ పదవులు ఎస్సీ మహిళ, సంగారెడ్డి ఎస్సీ కోటా, జయశకంకర్ భూపాలపల్లి, కరీంనగర్ , కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు బిసి అభ్యర్ధులకు కేటాయించారు.

నిర్మల్ , నిజామాబాద్ , సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్ జడ్జీలు బీసిలకు కేటాయించారు. మహబూబ్ నగర్ , మంచిర్యాల , నాగర్ కర్నూల్ , వనపర్తి , యాదాద్రి భువనగిరి జడ్పీలు బీసీ మహిళ ఇచ్చారు. ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, నారాయణపేట జడ్పీలు ఓసీ మహిళ కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్ , మెదక్ జడ్పీలు ఓసీ జనరల్ కు ఇచ్చారు. ఇలా స్ధానిక ఎన్నికల్లో కీలకంగా మారిన జెడ్పీ చైర్ పర్సన్ స్ధానాలో మీరెంతో , మీకంత అనే రూల్ ఫాలో అయ్యింది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం.

### ఓటు బ్యాంకును తేల్చనున్న స్థానిక ఎన్నికలు

రాబోతున్న స్ధానిక సంస్ధల ఎన్నికలే తెలంగాణలో అన్ని పార్టీలకు ఆయువుపట్టులాంటివి. స్ధానికంగా బలమైన క్యేడర్ ను ఏర్పాటు చేసుకోవడంతోపాటు, సర్పంచ్ లు, ఎంపీటీసిలు, జేడ్ పీటీసీలలో ఎక్కువ సీట్లు దక్కించుకోవడం ద్వారా ఓటు బ్యాంక్ ను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలే సరైన అవకాశం. ఈ ఎన్నికల్లో గెలుపు లెక్కల ఆధారంగానే మరో మూడేళ్ల తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. స్ధానిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్ధులే ఆయా పార్టీలు అధికారం చేపట్టడంలో క్షేత్ర స్ధాయిలో కీలకంగా వ్యవహరిస్తారు. స్ధానిక సంస్ధల ఎన్నికలే తెలంగాణలో రెండేళ్ల కాంగ్రెస్ పాలకు కొలమానంగా ఆ పార్టీ భావిస్తోంది. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తుందనే నమ్మకం కల్పించామనే ధీమాతో ఉంది. గత పదేళ్లు అధికారంలో లేకపోవడంతో కాంగ్రెస్ కు క్యాడర్ దూరమైయయింది. కేవలం కాంగ్రెస్ విధేయులు మాత్రమే పార్టీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కవ మంది ప్రజాప్రనిధులు కాంగ్రెస్ నుండి గెలిస్తే వారితో వచ్చే క్యాడర్ పార్టీకి బలంగా మారుతుందని అంచానా వేస్తోంది.అందులోనూ 42శాతం బిసి రిజర్వేషన్ సానుకూలంగా ప్రభావం చూపుతుందని భావిస్తోంది రేవంత్ సర్కార్. ఎన్ని అడ్డంకులు వచ్చినా కాంగ్రెస్ చిత్తశుద్ధి చూపించిందనే నమ్మకం జనాల్లోకి వెళ్లిందని, బీసీలంతా తమకే ఓటేస్తారనే బిసి మంత్రులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించడం కూడా అనుకూల ఫలితాలు వస్తాయని భావిస్తోంది. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నాలకు బోనస్ వంటి అంశాలపై కూడా చాలా ఆశలు పెట్టుకుంది. ఇవన్నీ స్ధానిక ఓటర్లపై ప్రభావం చూపే అంశాలు. ఈ ఎన్నికల్లో సత్తా చాటి ప్రతిపక్షాలకు గట్టి బదులివ్వాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ.




### బలాన్ని నిరూపించుకోవాలనుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ

బీఆర్ఎస్ కూడా తామేం తక్కువ తినలేదంటూ స్ధానిక పోరుకు సిద్ధంగా ఉంది. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాల సాధిస్తే క్యాడర్ లో కొత్త జోష్ వస్తుందని నమ్ముతోంది. కాంగ్రెస్ సర్కార్ పై వ్యతిరేకత వచ్చిందనేది నిరూపించే ఎన్నికలు ఇవేనని గులాబీ నేతలు భావిస్తున్నారు. గల్లీ ఎన్నికలైనా ఢిల్లీ ఎన్నికలైనా కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారనేది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. బిజెపి కూడా క్షేత్రస్ధాయిలో తమ బలాన్ని పరిక్షించుకోవడానికి, లోకల్ గా పార్టీకి చికిత్స చేయడానికి స్ధానిక ఎన్నికలే సరైన వేదికగా భావిస్తోంది. పార్టీలో సమన్వయ లోపంతో మంచిఫలితాలు రావడంలేదని భావనలో ఉంది.

ఆ లోపాలను స్ధానికంగా సరిచేసుకోవాలని, ప్రత్యర్ధులకు గట్టి సమాధానం ఇవ్వాలని భావిస్తోంది. 8 ఎంపీలు గెలిచిన మాకు 35శాతం ఓటు బ్యాక్ ఉంది. రూరల్ సైడ్ మా బలం పెరిగింది. స్ధానిక పోరులో బిజెపి నంబర్ వన్ లో ఉంటుందని కమలం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే తాజ్జాగా మారిన బీసీ లెక్కల ప్రకారం బీసీలు ఏ పార్టీవైపు ఉంటారనేదాన్నిబట్టే, ఆయా పార్టీల గెలుపు లెక్కలు ఆధారపడి ఉంటాయని రాజకీయనిపుణులు అంచనా వేస్తున్నారు.

# రోడ్డుపై పార్కింగ్ పట్టించుకోని ట్రాఫిక్ పోలీస్

- అడుగడుగునా ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల బాధ్యతారహిత్యం
- రహదారి, ఫుట్పాత్ కబ్జా చేసిన అటువైపు చూడని ట్రాఫిక్ పోలీసులు
- కొబ్బరి బోండాలు ఫుట్ పాత్ వ్యాపారాలు నెల నెల మామూళ్ళు ఇస్తున్నారా.?
- ట్రాఫిక్ పోలీసులు లంచాలు తీసుకోకుంటే ఫుట్ పాత్, రోడ్డు కబ్జాలు తొలగించవచ్చు కదా.?
- హెూటల్స్ ముందు అక్రమ పార్కింగ్ తో పాదాచారులకు వాహనాదారులకు నానా ఇబ్బందులు







**తార్నాక (ప్రశ్న న్యూస్)** తార్నాక రహదారి కబ్జా చేసిన ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం అడుగడుగునా దర్శనమిస్తుంది. అక్రమ పార్కింగ్లతో రోడ్డును కబ్జా చేస్తున్న అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తార్నాక చౌరస్తా నుండి ఉప్పల్ వెళ్లే దారిలో సన్మాన్ హెూటల్, సురక్ష హాస్పిటల్ వరకు రహదారిపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవడం లేదు. దానికి తోడు లాలాపేట వెళ్లే వైపు తాజా కిచెన్ ముందు కారులు రోడ్డుపై నిత్యం పార్కు చేయడంతో అక్కడే ఉన్న యూటర్న్ వద్ద వాహనాలు తిరగకుండా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాజా కిచెన్ వద్ద ఎప్పుడు మూడు నాలుగు ఐదు వాహనాలు రహదారిపై పార్కింగ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే కాకుండా కొబ్బరి బోండాలు, ఇతర వ్యాపారులు ఫుట్పాత్ ఆక్రమించిన అటువైపు కన్నెత్తి చూడకపోవడం అసలు ఫుట్పాత్ కబ్జాలు జరుగుతున్నాయన్న విషయం ట్రాఫిక్ పోలీసులకు కనిపిస్తే లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసలు ట్రాఫిక్ పోలీసులు డ్యూటీ చేస్తున్నారా.? కేవలం ఫోటో తీస్తున్నారా.? వాహనాల తనిఖీలు చేయడం ఫోటోలు తీయడం దీనికే పరిమితమైనారని ఫుట్పాత్ ఆక్రమణలు రోడ్డు కబ్జాలు చేస్తున్న అసలు ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం వెనుక నెల నెల మామూలు వస్తున్నాయా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతో తార్నాక డివిజన్ లో పాదాచారులు ఫుట్పాత్ పై నడిచే పరిస్థితి లేదు. రోడ్డుపై నడిచి అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో కూడా తాజా కిచెన్ ముందు అక్రమ పార్కింగ్ తో రోడ్డు పై ఒక మహిళ వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన ఇప్పటికి స్థానికలను కలిచే వేస్తుంది, కానీ ట్రాఫిక్ పోలీసులలో కనీస చలనం కూడా లేకుండా పోయింది. ఇప్పటికైన ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్, ఉన్నత అధికారులు స్పందించి నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ల ఫుట్పాతుల కబ్జాపై దృష్టి సారించాలని సమస్య తీర్చాలని వాహనా దారులు ప్రజలు కోరుతున్నారు.

# దిగొచ్చిన హమాస్..

## ట్రంప్ ప్లాన్‌పై కీలక ప్రకటన

- గాజా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతి ప్రణాళిక
- ప్రతిపాదనలోని కొన్ని ముఖ్య అంశాలకు హమాస్ పాక్షిక అంగీకారం
- బందీలందరినీ విడుదల చేసేందుకు తాము సిద్ధమని ప్రకటన
- గాజా పాలనను స్వతంత్రులకు అప్పగించేందుకు కూడా ఓకే
- నిరాయుధీకరణపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వని హమాస్



**అమెరికా (ప్రశ్న న్యూస్)** గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై హమాస్ సానుకూలంగా స్పందించింది. బందీల విడుదల, గాజా పాలనను స్వతంత్రులకు అప్పగించడం వంటి కీలక అంశాలకు అంగీకారం తెలిపిన హమాస్, ప్రణాళికలోని పలు ఇతర షరతులపై మాత్రం చర్చలు జరపాలని కోరుతోంది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ట్రంప్ ఇచ్చిన 20 అంశాల ప్రతిపాదనను అంగీకరించడమో లేదా తిరస్కరించడమో ఆదివారం లోగా తేల్చాలని గడువు విధించిన నేపథ్యంలో హమాస్ ఈ స్పందన తెలియజేసింది. గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు, ఖైదీల మార్పిడికి, తక్షణ సహాయం అందించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలతో పాటు అరబ్, ఇస్లామిక్, అంతర్జాతీయ కృషిని తాము అభినందిస్తున్నట్లు హమాస్ తన ప్రకటనలో పేర్కొంది.

ట్రంప్ ప్రణాళికలో పేర్కొన్న ఫార్ములా ప్రకారం ఇజ్రాయెల్ వద్ద ఉన్న తమ ఖైదీలకు బదులుగా, తమ వద్ద ఉన్న బందీలందరినీ (మృతదేహాలతో సహా) విడుదల చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, గాజా స్ట్రిప్ పాలనా బాధ్యతలను జాతీయ ఏకాభిప్రాయంతో ఏర్పడే స్వతంత్ర టెక్నోక్రాట్ల ప్యానెల్‌కు అప్పగించడానికి కూడా సిద్ధమని ప్రకటించింది. అయితే, ప్రతిపాదనలోని ఇతర వివరాలపై చర్చించేందుకు మధ్యవర్తుల ద్వారా తక్షణమే చర్చలు ప్రారంభించాలని హమాస్ తేల్చిచెప్పింది. ఇజ్రాయెల్, అమెరికా ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న నిరాయుధీకరణ అంశంపై మాత్రం హమాస్ తన ప్రకటనలో ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ట్రంప్ ప్రణాళికలో తక్షణ కాల్పుల విరమణ, బందీలు-ఖైదీల మార్పిడి, గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల దశలవారీ ఉపసంహరణ, హమాస్ నిరాయుధీకరణ, అంతర్జాతీయ పర్యవేక్షణలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. హమాస్ తాజా స్పందనపై వైట్ హౌస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# అక్రమ నిర్మాణాలు జోరు..

# అధికారుల జేబులు ఫుల్

- నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు కట్టుకో ముడుపులు ఇచ్చుకో
- అక్రమ నిర్మాణాలకు అధికారుల వత్తాసు అంతా మామూళ్ల మాయనా.?
- 5 నెలలలో జిహెచ్ఎంసి కాబోతున్న నేపథ్యంలో అందిన కాడికి దండుకుంటున్న అధికారులు
- మాజీ ప్రజా ప్రతినిధుల కనుసైగల్లోనే జరుగుతున్న అవినీతి దందా









**నాగారం(ప్రశ్న న్యూస్)** నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్న పట్టించుకోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు అంటూ స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే నాగారం మున్సిపల్ పరిధిలోని శిల్పా నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో అక్రమంగా కమర్షియల్ షెటర్స్ నిర్మాణం చేస్తున్నా మున్సిపల్ సిబ్బంది చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. మరికొద్ది రోజుల్లో జిహెచ్ఎంసిలో కలవబోతుందని అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని అందులో భాగంగానే పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలు జరుపుతున్న అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ పెద్ద ఎత్తున ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకులతో అధికారులు చేతులు కలిపి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారని, నీకు కొంత మాకు కొంత వాటాల పేరుతో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అక్రమంగా ముడుపులు దండుకుంటున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్న అధికారులల్లో మాత్రం చీమకుట్టినట్లుగా లేదని, పత్రికలలో కథనాలు వచ్చిన ఎలాంటి చర్యలు తీసుకో లేకపోవడం గల కారణాలు అవే అని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాత భవనాలపై కొత్త నిర్మాణాలు చేస్తున్న అధికారులలో ఎలాంటి చలనం లేదంటూ కొద్ది రోజులలో జిహెచ్ఎంసి లో కలవబోతునదన్న సందేశంతో పెద్ద మొత్తంలో ముడుపులు దండుకోవాలని చూస్తున్నారని ప్రజలకు ఎలాంటి సేవలు చేయడం లేదంటూ ప్రధాన రహదారులపై వర్షపు నీరు మోకాల ఎత్తున ప్రవహిస్తున్న చర్యలు మాత్రం శూన్యం అంటున్న స్థానికులు, ప్రజల సమస్యలు గాలికి వదిలేసి అక్రమ లావాదేవీల పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టారని ఈ అక్రమ నిర్మాణాలు చూస్తేనే అర్థమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని దీనిపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588